


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 28, పేజీలు - 08

బుధవారం, జులై 2, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## చరిత్రలో తొలిసారి.. సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

**- సిబ్బంది నియామకాలు, ప్రమోషన్లలో కొత్త విధానం**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ అత్యున్నత న్యాయస్థానం భారత సుప్రీంకోర్టు చరిత్రలో ఒక కీలకమైన, చారిత్రక నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకు తొలిసారిగా, తన సిబ్బంది నియామకాలు మరియు పదోన్నతుల్లో షెడ్యూల్డ్ కులాలు

2లో..

## అవును.. నేను అదృష్టవంతుడినే

**- లాటరీ తగిలిందన్న వ్యాఖ్యలపై సిద్ధరామయ్య స్పందన**



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో అసమ్మతి సెగలు రాజుకుంటున్నాయి. సొంత పార్టీ నేతల నుంచి వస్తున్న విమర్శలు అధికార పార్టీని ఇబ్బందుల్లోకి

2లో..

## టెక్నాలజీతో ఎలాంటి కేసునైనా ఛేదించవచ్చు



**- వైఎస్ వివేకా కేసే నిదర్శనం**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలీసు శాఖకు దిశానిర్దేశం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్లిష్టమైన కేసులను సైతం ఎలా ఛేదించవచ్చో

2లో..

# కేసీఆర్ సంతకాలే మరణ శాసనం

- జలాల విషయంలో వెనక్కి తగ్గేది లేదన్న రేవంత్ రెడ్డి
- ప్రజాభవన్‌లో 'గోదావరి-బనకచర్ల'పై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్
- గత పదేళ్లలో కేసీఆర్, హరీశ్ రావులే రాష్ట్రానికి నష్టం చేశారని ఆరోపణ
- 2015 నాటి ఒప్పందమే తెలంగాణకు మరణశాసనంగా మారిందని తీవ్ర విమర్శ
- రాష్ట్ర నీటి హక్కుల కోసం రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతామని వెల్లడి
- ఏపీ ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటుంటే తెలంగాణ ప్రాజెక్టులు పట్టించుకోలేదని వ్యాఖ్య




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బనకచర్ల వివాదంతో చంద్రబాబును భూతంగా చూపించడానికి కేసీఆర్ ఫామ్ హౌస్‌లో క్షుద్రపూజలు చేస్తున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. బనకచర్ల అంశంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి "మరణ శాసనం"గా మారాయని ఆరోపించారు. ముఖ్యంగా, కేసీఆర్ మరియు హరీష్ రావు

2లో..

# ఆ రోజు ఏం జరిగిందంటే.?

**- ఆపరేషన్ సిందూర్-ట్రంప్ జోక్యంపై జైశంకర్ వివరణ**

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కాశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ ను ప్రారంభించింది. నాలుగు రోజుల పాటు ఈ ఆపరేషన్ జోరుగా కొనసాగింది. అయితే ఉన్నట్లుండి ఐదో రోజు భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ చేశారు. దీంతో మరో వివాదం మొదలైంది. భారత్-పాక్ కాల్పుల విరమణకూ, అమెరికాకూ సంబంధం లేదంటూ మనం చెప్తుంటే, ట్రంప్ మాత్రం తానే వాణిజ్యాన్ని అడ్డుపెట్టి యుద్ధం ఆపానని

2లో..



## స్వల్పంగా తగ్గిన జీఎస్టీ వసూళ్లు

**- జూన్‌లో రూ.1.85 లక్షల కోట్లు**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల జోరుకు స్వల్పంగా బ్రేక్ పడింది. వరుసగా రెండు నెలల పాటు రూ.2 లక్షల కోట్ల మార్కును అధిగమించిన వసూళ్లు, జూన్‌లో మాత్రం స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. 2025 జూన్ నెలకు గాను రూ.1.85 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. గత సంవత్సరంతో పోలిస్తే వసూళ్లలో వృద్ధి కనబడనప్పటికీ, అంతకుముందు నెలలతో పోలిస్తే ఈ మొత్తం తక్కువగా ఉంది.

2లో..

## నేను మీరనుకున్నంత సౌమ్యుడిని కాదు

**- బీజేపీ కొత్త అధ్యక్షుడు హాట్ కామెంట్స్**

- తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడిగా రామచందర్‌రావు ఏకగ్రీవ ఎన్నిక
- గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేయడమే తన లక్ష్యమని ప్రకటన
- కాంగ్రెస్ పార్టీ ఫేక్ న్యూస్ యూనివర్సిటీ నడుపుతోందని తీవ్ర విమర్శ
- పార్టీలో కొత్త, పాత తేడాల్లేవని, అందరూ కలిసి పనిచేయాలని పిలుపు

2లో..




## ఎన్నికలకు ముందు పాదయాత్ర

**- యువనేతల సమావేశంలో జగన్ ప్రకటన**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన రాజకీయ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ యువజన విభాగం భేటీలో తాను ఎలా రాజకీయ ప్రయాణం మొదలుపెట్టానో, ఆ తర్వాత తనను ప్రత్యర్థులు ఎలా టార్గెట్ చేశారో, చివరికి అధికారంలోకి ఎలా వచ్చారో వివరించారు. పార్టీలో యువజన నేతలు కూడా తనను ఆదర్శంగా తీసుకుని ముందుకొస్తే వారికి మంచి అవకాశాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు జగన్ హామీ ఇచ్చారు.

2లో..

# రాజకీయ ముసుగులో దోపిడీని సహించను

**- ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిక**

- కొవ్వూరులో సీఎం చంద్రబాబు పర్యటన, లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ల పంపిణీ
- గత ప్రభుత్వంలో పింఛన్ల పేరుతో దోపిడీ జరిగిందని ఆరోపణ
- రాష్ట్రంలో పింఛన్ల కోసం నెలకు రూ.2,750 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడి
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, త్వరలో నిరుద్యోగ భృతి
- 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తుండటంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వంలో జరిగిన మోసాలకు, అక్రమాలకు చరమగీతం పాడుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

2లో..



## ప్రమోషన్లు ఇచ్చింది ఫలితాలు చూపించడానికే

- ఆర్అండ్‌బీ శాఖ పనుల పురోగతిపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష
- ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం
- నిధుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తి మద్దతు ఇస్తున్నారని వెల్లడి

2లో..



## పార్టీకి కార్యకర్తలే నిజమైన బలం

**- అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కిషన్ రెడ్డి పిలుపు**

- బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపణ
- మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల్లోకి నెట్టిందని విమర్శ
- ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఫైర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కొత్త అధ్యక్షుడి ఎన్నిక విషయంలో పార్టీ అంతర్గత అంశాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. బీజేపీలో పదవులు ముఖ్యం కాదని ఆయన అన్నారు. "రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా ఫర్వాలేదు.

2లో..

## పాశమైలారం ఫ్యాక్టరీని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

- తక్షణ సాయం ప్రకటించిన రేవంత్ రెడ్డి
- మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం
- కంపెనీ నుంచి ఇప్పిస్తామన్న సీఎం రేవంత్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు సంభవించిన ఘటన స్థలాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్, రాజనర్సింహ్మతో కలిసి పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను

2లో..

## సిగాచి ప్రమాదంపై హెచ్ఆర్సీ సుమోటో

- జులై 30లోగా నివేదికకు ఆదేశం
- పాశమైలారం ఘటనపై ఫిర్యాదుల వెల్లువ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి కెమికల్ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటన తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ దుర్ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ) సుమోటోగా కేసు నమోదు చేయగా, మరోవైపు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు

2లో..

# వల్లభనేని వంశీకి బెయిల్

**- నేడు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** గన్నవరం మాజీ ఎమ్మెల్యే , వైసీపీ నేత వల్లభనేని వంశీ మోహన్‌కి భారీ ఊరట లభించింది. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వల్లభనేని వంశీ మోహన్‌కు బెయిల్ మంజూరైంది. నూజివీడు కోర్టు వల్లభనేని వంశీకి బెయిల్ మంజూరు చేసింది. నకిలీ ఇళ్లపట్టాల కేసు లో వల్లభనేని వంశీ ప్రస్తుతం విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరోవైపు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు, గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి, నకిలీ ఇళ్లపట్టాల కేసు, అక్రమ తవ్వకాల ఆరోపణలపై వల్లభనేని వంశీపై కేసులు నమోదయ్యాయి. అయితే ఇప్పుడు అన్ని కేసులలో బెయిల్ మంజూరు కావటంతో నేడు వల్లభనేని వంశీ జైలు నుంచి విడుదల అయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఏలూరు జిల్లా బాపులపాడులో నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారనే ఆరోపణలపై వల్లభనేని వంశీ మోహన్, అతని అనుచరుడు మోహన్ రంగారావుపై

3లో..



# చరిత్రలో తొలిసారి..
# సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

(ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు రిజర్వేషన్ల విధానాన్ని అధికారికంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం దిశగా సుప్రీంకోర్టు ఒక బలమైన ముందడుగు వేసినట్లయింది. ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తూ జూన్ 24న సుప్రీంకోర్టు ఒక అంతర్గత సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ సర్క్యులర్ ప్రకారం, రిజర్వేషన్ల విధానం జూన్ 23, నుంచే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. దీని ప్రకారం, కోర్టులో ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతుల ద్వారా భర్తీ చేసే పోస్టుల్లో ఎస్సీ వర్గాలకు 15 శాతం, ఎస్టీ వర్గాలకు 7.5 శాతం కోటా వర్తిస్తుంది. ఈ రిజర్వేషన్ల అమలు కోసం రూపొందించిన 'మోడల్ రిజర్వేషన్ రోస్టర్', సంబంధిత రిజిస్టర్ల వివరాలను కోర్టు అంతర్గత నెట్‌వర్క్ అయిన 'సుప్‌నెట్'లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ రిజర్వేషన్ విధానం సుప్రీంకోర్టులోని రిజిస్ట్రార్లు, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్లు, జూనియర్ కోర్టు అసిస్టెంట్లు, ఛాంబర్ అటెండెంట్లు వంటి పలు స్థాయిల్లోని పోస్టులకు వర్తించనుంది. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించేందుకు కూడా చర్యలు తీసుకున్నారు.

విడుదల చేసిన రిజర్వేషన్ జాబితాలో ఏవైనా లోపాలు ఉన్నాయని భావిస్తే, సిబ్బంది తమ అభ్యంతరాలను నేరుగా రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) దృష్టికి తీసుకురావచ్చని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయి హయాంలో ఈ చారిత్రక నిర్ణయం వెలువడటం గమనార్హం. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని అధిష్టించిన రెండో వ్యక్తిగా జస్టిస్ గవాయి చరిత్ర సృష్టించారు. ఆయన పదవీకాలంలోనే అత్యున్నత న్యాయస్థానంలో రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# అవును.. నేను అదృష్టవంతుడినే

నెడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేవలం అదృష్టం వల్లే ఆ పదవిలో ఉన్నారంటూ ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు, ముఖ్యమంత్రి అంతే ఘాటుగా సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ మంగళవారం మాట్లాడుతూ, "సిద్ధరామయ్యకు లాటరీ తగిలింది. ఆయన్ను సోనియాగాంధీకి పరిచయం చేసిందే నేను. ఆయన అదృష్టం బాగుండి ముఖ్యమంత్రి అయ్యారు. నాకు ఏ గాడ్ ఫాదర్ లేరు. నేను పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సూర్జేవాలాను కలిసి చెప్పాల్సిందంతా చెప్పా. ఏం జరుగుతుందో చూద్దాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వీడియో బయటకు రావడంతో రాజకీయ దుమారం రేగింది. ఈ విమర్శలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనదైన శైలిలో స్పందించారు. "అవును నేను అదృష్టవంతుడినే. అందుకే ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్నాను" అని బదులిచ్చారు.

### - అసలేం జరిగింది?

తన నియోజకవర్గమైన అలంద్‌లో పేదలకు ఇళ్ల కేటాయింపులో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఇటీవల ఆరోపణలు చేశారు. అయితే, ఈ ఆరోపణలను గృహనిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఖండించారు. కేటాయింపులన్నీ పారదర్శకంగానే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ వివాదం తర్వాత మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజు కాజే, బేలూర్ గోపాలకృష్ణ కూడా తమ ప్రభుత్వంపై అసంతృప్తిని వెళ్లగక్కారు.

### - రంగంలోకి అధిష్ఠానం

ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసమ్మతి స్వరాలు వినిపిస్తుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సూర్జేవాలాను బెంగళూరుకు పంపింది. ఆయన అసంతృప్త ఎమ్మెల్యేలతో చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఉండదని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి మార్పుపై వస్తున్న ఊహాగానాల వెనుక బీజేపీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గ్యారంటీలు నిలిచిపోవాలనే దురుద్దేశంతోనే బీజేపీ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

# టెక్నాలజీతో ఎలాంటి కేసునైనా ఛేదించవచ్చు

వివేకానంద రెడ్డి హత్య కేసే నిరూపిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలో నిర్వహించిన 'ఏఐ ఫర్ ఏపీ పోలీస్–హ్యాకథాన్–2025' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా ఆయన, శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని, అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

### - గూగుల్ టేకౌట్‌తో బయటపడ్డ నిజాలు

గత ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను ఈ సందర్భంగా చంద్రబాబు తిప్పికొట్టారు. "వివేకా హత్య కేసులో నాపై బురద చల్లాలని చూశారు. నారాసుర రక్త చరిత్ర అంటూ దారుణంగా విమర్శించారు. కానీ, సీబీఐ దర్యాప్తులో గూగుల్ టేకౌట్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడటంతోనే అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి" అని ఆయన గుర్తు చేశారు. తప్పులు చేసి, వాటిని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించే వారి ఆటలు ఇక సాగవని, సాంకేతిక పరిజ్ఞానంతో అలాంటి వారిని సులభంగా పట్టుకోవచ్చని అన్నారు. ఇటీవల తెనాలిలో మాజీ ముఖ్యమంత్రి రౌడీ షీటర్లకు సంఘీభావం తెలపడాన్ని, పల్నాడు జిల్లా పర్యటనలో జరిగిన ఘటనలను ఆయన ప్రస్తావిస్తూ విమర్శించారు.

### - అరాచకాలు చేస్తే తాటతీస్తాం

రాష్ట్రంలో నేరాలకు పాల్పడే వారిని కఠినంగా అణచివేస్తామని చంద్రబాబు హెచ్చరించారు. "ఇష్టానుసారంగా గంజాయి అమ్మడం, పండించడం, సేవించడం వంటివి చేస్తే సహించేది లేదు. ఆడబిడ్డల జోలికి వస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు. అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు" అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. డ్రోన్లు, సీసీటీవీ కెమెరాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచుతామని, తప్పు చేసిన వారిని ఆధారాలతో సహా పట్టుకుంటామని స్పష్టం చేశారు.

### - క్వాంటం వ్యాలీతో తెలుగు వారి సత్తా

రాష్ట్ర యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రపంచస్థాయిలో రాణించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. "గతంలో ఐటీని ప్రోత్సహించాం. ఇప్పుడు క్వాంటం వ్యాలీ ద్వారా తెలుగు వారి సత్తాను ప్రపంచానికి చాటబోతున్నాం. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఎలాగో, ఇక్కడ క్వాంటం వ్యాలీ అలా ఉండాలి" అని ఆయన తన దార్శనికతను వివరించారు.

'స్థానికంగా పనిచేస్తూ, ప్రపంచస్థాయిలో ఆలోచించాలి' అనే నినాదంతో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. నేరాల నియంత్రణ, వేగవంతమైన దర్యాప్తు కోసం ఏపీ పోలీస్ విభాగం, అమెరికాకు చెందిన '4 సైట్ ఏఐ' సంస్థలు సంయుక్తంగా ఈ హ్యాకథాన్‌ను నిర్వహించాయి. ఇందులో 160కి పైగా బృందాలు పాల్గొన్నాయి. ముఖ్యమంత్రి ఈ బృందాలతో ముచ్చటించి, వారి ఆలోచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు ముందు పాదయాత్ర

ప్రజలకు అందుబాటులో ఉండటం రాజకీయాల్లో ఎంతో ముఖ్యమని, ఇందుకోసం సోషల్ మీడియాను వాడుకోవాలని వైసీపీ యువజన విభాగానికి జగన్ సూచించారు. గతంలో ప్రజల్లో ఉంటూ తాను రాజకీయాల్లో ఎలా ఎదిగారో ఆయన నేతలకు వివరించారు. వైసీపీ ప్రారంభించినప్పుడు అందరూ కొత్తవాళ్లేనని, తాను, తల్లి విజయమ్మ మాత్రమే ఉన్నామని గుర్తుచేశారు. అప్పట్లో ఉప ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజార్టీతో తాను గెలిచాక పార్లమెంట్‌లో ప్రతీ ఒక్కరూ తనవైపే చూసే పరిస్థితి వచ్చిందన్నారు. దీన్ని చూడలేక తనపై పగ పట్టారని జగన్ గుర్తుచేసుకున్నారు. 18 మంది ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తే రాజీనామాలు చేయించి ఉపఎన్నికలకు వెళ్లి ఘన విజయం సాధించామని జగన్ గుర్తుచేశారు. అప్పట్లో టీడీపీ, కాంగ్రెస్ కలిసే పోటీ చేశాయన్నారు. 2014 ఎన్నికల్లో 67 సీట్లు గెల్చుకున్నామని, ఇందులో 23 మందిని టీడీపీ లాక్కుందన్నారు. అయినా ఎన్ని కష్టాలు వచ్చినా విశ్వసనీయతకే పెద్దపీట వేశామని, ఎక్కడా రాజీపడలేదని జగన్ తెలిపారు. ఇప్పుడు వైసీపీ నేతలు కూడా జనంలోనే ఉంటూ వారికి చేరువ కావాలన్నారు. అప్పుడు నాయకులుగా ఎదుగుతారని తెలిపారు.

రాజకీయంగా ఎదగడం మీ చేతుల్లోనే ఉందని, మిమ్మల్ని రాజకీయంగా పెంచడం తన చేతుల్లో ఉందని యువజన నేతలకు జగన్ తెలిపారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని, సమర్థుల్ని పార్టీ వ్యవస్థల్లోకి తీసుకురావాలని కోరారు. సోషల్ మీడియాను వాడుకుంటూ ప్రభుత్వ తప్పుల్ని ఎప్పటికప్పుడు జనంలోకి తీసుకెళ్లి ప్రశ్నించాలన్నారు. సమాజంలో ఎవరికి అన్యాయం జరిగినా అందరి దృష్టికి తీసుకురావాలన్నారు. పార్టీలో జోన్ల వారీగా యూత్ ప్రెసిడెంట్లను పెట్టడంతో పాటు పలు మార్పులు చేస్తున్నట్లు వారికి జగన్ తెలిపారు.

# కేసీఆర్ సంతకాలే మరణ శాసనం

సంతకాలతో ఆంధ్రప్రదేశ్‌తో జరిగిన ఒప్పందాలు రాష్ట్ర జల వనరులను దెబ్బతీశాయన్నారు. రాయలసీమకు నాలుగు వందల టీఎంసీల జలాలను తరలించడానికి 2016లో కేసీఆర్ , చంద్రబాబు మధ్య చర్చలు జరిగాయని జగన వచ్చాక పెన్నాకు తరలించడంపై చర్చలు జరిగాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత పోలవరం–బనకచెర్ల ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం గట్టిగా నిలబడిందని, ఈ ప్రాజెక్ట్ గోదావరి నది నీటి వాటాపై తెలంగాణ హక్కులను కాలరాస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ యొక్క ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ (ఈఏసీ) తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ విజయంగా ఆయన వర్ణించారు. తెలంగాణ జల హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. గోదావరి నది నీటి వాటాపై ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత బనకచెర్ల ప్రాజెక్ట్‌కు వ్యతిరే కంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో జూన్ 19న ఢిల్లీలో సమావేశమై, ఈ ప్రాజెక్ట్‌ను నిలిపివేయాలని కోరినట్లు తెలిపారు. గోదావరి నదీ జలాల ఒప్పందం (జీడబ్ల్యూడీటీ –1980)లో వరద నీటి లేదా అదనపు నీటి గురించి ప్రస్తావన లేదని, ఆంధ్రప్రదేశ్ ఈ ప్రాజెక్ట్‌ను ఆధారం చేసుకుని తెలంగాణ హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 2016లో కేసీఆర్, హరీష్ రావు చేసుకున్న ఒప్పందాలతోనే బనకచర్ల ప్రాజెక్టుకు పునాది వేశారని ఇది గోదావరి జలాలను రాయలసీమకు తరలించే ప్రయత్నంగా ఉందని విమర్శించారు. కేసీఆర్‌ను "శకుని మామ"గా, హరీష్ రావును "శనీశ్వరుడు"గా అభివర్ణించారు, ఈ ఇద్దరి నిర్ణయాలు తెలంగాణకు అన్యాయం చేశాయని ఆరోపించారు. కృష్ణా నదీ జలాల విషయంలో, బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఏకీకృత ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీ అడుగుల నీటిలో తెలంగాణకు 66% ఉండగా, కేసీఆర్ కేవలం 299 టీఎంసీ అడుగులకు సంతకం చేశారని, దీనివల్ల తెలంగాణకు 512 టీఎంసీ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చారని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టును తిరస్కరించడం తెలంగాణ ప్రజల విజయమని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి నిదర్శనమని రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఈ అంశంపై ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ చచ్చిపోయిన బీఆర్ఎస్ పార్టీకి నీటి వివాదంతో ఊపిరి పోసుకుందామని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. అబద్దాలు చెప్పడం వల్లనే 2023లో ఆ పార్టీ ఓడిపోయిందన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాలేదని ఆ తర్వాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అసలు అభ్యర్థులే దొరకలేదన్నారు.

# ఆ రోజు ఏం జరిగిందంటే.?

చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో భారత్ మరో కీలక సాక్ష్యం బయటపెట్టింది. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతున్న క్రమంలో అనూహ్యంగా సీజ్ ఫైర్ ఒప్పందం జరగడానికి ముందు వార్ రూమ్ లో చోటు చేసుకున్న పరిణామాల్ని విదేశాంగమంత్రి జైశంకర్ ఇవాళ బయటపెట్టారు. పాకిస్తాన్ పై భారత్ దాడులు చేస్తున్న సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత ప్రధాని మోడీకి ఫోన్ చేశారని ఆయన తెలిపారు. ఆ సమయంలో తాను కూడా అదే రూమ్ లో ఉన్నట్లు జైశంకర్ తెలిపారు. మీరు యుద్ధం ఆపకపోతే పాకిస్తాన్ మీపై తీవ్రంగా దాడులు చేయబోతోందని జేడీ వాన్ భారత ప్రధాని మోడీకి తెలిపినట్లు జైశంకర్ వెల్లడించారు. దీనికి కౌంటర్ గా తాము కూడా ప్రతీకార దాడులు చేస్తామని ప్రధాని మోడీ వాన్స్ కు చెప్పేశారన్నారు. మే9న పాకిస్తాన్ తమపై భారీగా దాడులు చేసిందని, అయితే తాము కూడా అంతే దీటుగా వాటిని తిప్పికొట్టామని జైశంకర్ వెల్లడించారు. ఆ తర్వాతి రోజు మళ్లీ అమెరికా విదేశాంగశాఖ కార్యదర్శి మార్కో రూబియో ఫోన్ చేసి పాకిస్తానీయులు మీతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారన్నారు. ఆ మధ్యాహ్నం తరువాత, పాకిస్తాన్ సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ కాశిఫ్ అబ్దుల్లా నేరుగా భారత లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్‌కు ఫోన్ చేసి కాల్పుల విరమణ కోరారన్నారు. దీంతో కాల్పుల విరమణకు తాము కూడా అంగీకరించినట్లు జైశంకర్ వెల్లడించారు. ఇందులో ట్రంప్ చెబుతున్నట్లు జోక్యం కానీ, వాణిజ్యాన్ని అడ్డుపెట్టి హెచ్చరికలు చేసిందీ లేదన్నారు.

# రాజకీయ ముసుగులో దోపిడీని సహించను

మంగళవారం కొవ్వూరు నియోజకవర్గంలోని మలకపల్లిలో నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. సానమాండ్ర పోశిబాబు అనే లబ్ధిదారుడికి చర్మకార పింఛను, గెడ్డం కృష్ణదుర్గకు వితంతు పింఛను అందజేసి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

### - పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఏపీ ముందుంది

గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు సక్రమంగా అందేవి కావని, కానీ తమ ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీనే అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తాను గతంలో రూ.200 ఉన్న పింఛనును రూ.2,000 చేశానని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు రూ.4,000కు పెంచామని గుర్తుచేశారు. "డయాలసిస్ రోగులకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నాం. పింఛన్ల కోసం నెలకు రూ.2,750 కోట్లు ఖర్చు చేస్తున్నాం. తెలంగాణ, కేరళ వంటి పెద్ద రాష్ట్రాలు కూడా ఈ విషయంలో మన దరిదాపుల్లో లేవు" అని ఆయన వివరించారు.

### - గత పాలనపై తీవ్ర విమర్శలు

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అరాచకాలు పెరిగాయని, వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని చంద్రబాబు ఆరోపించారు. "రాజకీయ ముసుగులో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేవారిని ఉపేక్షించను. గత ప్రభుత్వంలో వైకల్యం లేనివారికి కూడా పింఛన్లు ఇచ్చి ప్రజాధనాన్ని దోచేశారు. గంజాయి బ్యాచ్‌ను పరామర్శించే వారిని ఏమనాలో ప్రజలే ఆలోచించాలి. గంజాయి, డ్రగ్స్ అమ్మితే తాట తీస్తాం," అని హెచ్చరించారు. వివేకానంద రెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ, గుండెపోటు అని చెప్పి తననే నమ్మించారని, ఆనాడే నిందితులను అరెస్టు చేసి ఉంటే రాష్ట్రానికి ఈ దుస్థితి పట్టేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

### - అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కీలక ప్రకటనలు

రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. నెల రోజుల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, వీలైనంత త్వరగా నిరుద్యోగ భృతికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, ఈ ఏడాది డిసెంబర్‌కల్లా డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తామన్నారు.

### - పేదరిక నిర్మూలనకు 'పీ4' విధానం

పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా 'పీ4' (ప్రభుత్వం–ప్రైవేటు–ప్రజలు–పరోపకారం) విధానానికి శ్రీకారం చుట్టినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల చదువు మధ్యలోనే ఆపేసిన మూలపర్తి నవ్యశ్రీ అనే విద్యార్థిని తన గోడును వెళ్లబోసుకుంది. దీనికి తక్షణమే స్పందించిన ఠాకూర్ లేబొరేటరీస్ ప్రతినిధి, ఆ అమ్మాయి చదువుతో పాటు ఉద్యోగ బాధ్యతలను తమ సంస్థ తీసుకుంటుందని ప్రకటించారు. దీనిపై సీఎం హర్షం వ్యక్తం చేస్తూ, సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నవారు పేద కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక హామీలిచ్చారు. ఇక్కడ డిగ్రీ కాలేజీ ఏర్పాటు, ప్రభుత్వాసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని, లిఫ్ట్ ఇరిగేషన్ పనులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# పార్టీకి కార్యకర్తలే నిజమైన బలం

మన పార్టీకి కార్యకర్తలే నిజమైన నాయకులు, వాళ్లే మన బలం. నాయకత్వంలో ఎవరున్నా అందరూ ఐక్యంగా పనిచేయాలి" అని స్పష్టం చేశారు. రామచందర్‌రావు నాయకత్వంలో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అందరూ సమష్టిగా పని చేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మంగళవారం హైదరాబాద్ శివార్లలోని మన్నెగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్నాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఏమీ చేయడం లేదని కొందరు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ నిజాన్ని విమర్శకులు గుర్తించాలని ఆయన హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయం తామేనని, రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# నేను మీరనుకున్నంత సౌమ్యుడిని కాదు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీజేపీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ కేంద్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కేంద్రమంత్రి శోభాకరంద్లాజే ఆయన ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. అనంతరం రాంచందర్‌రావుకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి నూతన అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడిన ఆయన తొలి స్పీచ్‌లోన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాను అందరూ అనుకున్నట్లు సౌమ్యుడిని కాదని అన్నారు. క్యాంపస్‌లో చదువుతున్న రోజుల్లోనే 14 సార్లు జైలుకు పోయినట్లు చెప్పుకొచ్చారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసి లాఠీ దెబ్బలు తిన్న విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీలో 'కొత్త', 'పాత' అనే భేదాలు లేవని స్పష్టం చేశారు. బిడ్డ పుట్టగానే కుటుంబ సభ్యులు అయినట్టు పార్టీలో చేరగానే వారంతా పార్టీ కుటుంబ సభ్యులే అని వ్యాఖ్యనించారు. తాను పేరుకే అధ్యక్షుడినని ఎప్పటికీ కార్యకర్తను, ప్రజల సేవకుడినేనని పేర్కొన్నారు. పార్టీ ఈ స్థాయికి ఎదిగిందంటే ఎంతో మంది కార్యకర్తల, నాయకుల త్యాగాలు, చెమట కష్టమే కారణమని కొనియాడారు. నక్సలైట్ల తూటాలకు బలైన బీజేపీ నాయకుల బలిదానాల వల్లే పార్టీ ఈ స్థాయికి ఎదిగిందని, తాను కూడా నక్సలైట్ బాధితుడినేనని గుర్తుచేసుకున్నారు. కలిసికట్టుగా గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరేద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణ యువత రాజకీయాల్లోకి రావాలని, యువకులు, మహిళలు బీజేపీలోకి రావాలని అన్నారు. తెలంగాణ ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని, పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వాట్సాప్ యూనివర్సిటీలను పెట్టుకుని ఫేక్ న్యూస్‌తో ట్రోలింగ్ చేస్తున్నాయని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను క్రిమినల్ లాయర్‌ను కాబట్టి ఫేక్ న్యూస్ సూత్రధారులను బోనులో నిలబెట్టేందుకూ వెనుకాడనని హెచ్చరించారు. రాంచందర్ రావు సౌమ్యుడు, మెతక మనిషే అయినా యుద్ధంలోకి దిగితే యోధుడినేనని అన్నారు. ఏబీవీపీలో ఉన్నప్పుడు జైలుకు వెళ్లి, పోలీసుల లాఠీ దెబ్బలు తిని, కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నా సిద్ధాంతాన్ని వీడకుండా పనిచేసిన అనుభవం తనకు ఉందని చెప్పారు. గతంలో విద్యార్థులు, న్యాయవాదులు, పేదల పక్షాన న్యాయ పోరాటం చేశానని ఇకపై తెలంగాణ ప్రజల పక్షాన అలుపెరగని పోరాటాలకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అందరితో కలిసి పనిచేసి బీజేపీని అధికారంలోకి తీసుకొస్తానని ధీమా వ్యక్తం చేశారు

# ప్రమోషన్లు ఇచ్చింది ఫలితాలు చూపించడానికే

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నిధుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ శాఖకు పూర్తి మద్దతు ఇస్తున్నారని, కాబట్టి నిధుల గురించి ఆలోచించకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో రహదారులు, భవనాల (ఆర్‌అండ్‌బీ) శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. "ప్రమోషన్లు, పోస్టింగుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అన్నీ పూర్తి చేశాం. ఇప్పుడు మీరంతా ఫలితాలు చూపించాల్సిన సమయం వచ్చింది" అని అధికారులకు స్పష్టం చేశారు. శాఖ పరిధిలోని అన్ని రకాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, ఏమాత్రం జాప్యం తగదని ఆయన తేల్చిచెప్పారు. చీఫ్ ఇంజినీర్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పనుల నాణ్యతను స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. ఇకపై జరిగే ప్రతి సమీక్ష సమావేశానికి పనుల్లో ఎంత పురోగతి సాధించారో స్పష్టమైన నివేదికతో హాజరుకావాలని ఆదేశించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం, ఇతర ప్రాజెక్టులకు నిధుల కొరత లేదని మంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన ఆసుపత్రులు, నాణ్యమైన రహదారులను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. రెండు రోజుల్లో హ్యామ్ (హెచ్ఏఎం) రోడ్ల ప్యాకేజీలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. రహదారులపై ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్‌లను, వర్టికల్ కర్వ్‌లను ముందుగానే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీర్లకు సూచించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

# పాశమైలారం ఫ్యాక్టరీని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించిన మృతదేహాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే బంధువులకు అప్పగించాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో గతంలో తనిఖీలు నిర్వహించారా? బాయిలర్ల పనితీరును పరిశీలించి ఏమైనా సమస్యలు గుర్తించారా? అని అధికారులను ప్రశ్నించారు. బాయిలర్ల పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా హెచ్చరికలు జారీ చేశారా? అని ఆరా తీశారు. సిగాచి పరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా? అని కూడా అడిగారు. అయితే, అధికారులు సీఎం అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేకపోవడంతో ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దని హెచ్చరించారు. ప్రమాద ఘటనపై నిపుణులతో చర్చించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే తనిఖీలు చేసిన అధికారులతో కాకుండా కొత్తవారితో ఒక కమిటీని ఏర్పాటు చేసి, తక్షణమే నివేదికను ప్రభుత్వానికి అందజేయాలన్నారు. చనిపోయిన కార్మికులకు ఏదైనా బీమా ఉందా? అని కూడా ఆరా తీశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇతర పరిశ్రమల్లోనూ తనిఖీలను ముమ్మరం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరిహారం విషయంలో తీసుకున్న నిర్ణయం ఏంటో చెప్పాలని కంపెనీ ప్రతినిధిని అడిగారు. ఘటన జరిగి 24 గంటలు గడుస్తున్నా కంపెనీ ఎండీ స్పాట్‌కు రాకపోవటంపై సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇలాంటి ప్రమాద సమయంలో మానవత్వంతో వ్యవహరించాలని హితవు పలికారు. ప్రమాదంపై కంపెనీ యాజమాన్యమే పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పరిశ్రమలో పనిచేసే వారి నైపుణ్యాల గురించి కూడా సీఎం రేవంత్ ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు కంపెనీ నుంచే రూ. కోటి పరిహారం ఇచ్చే విధంగా అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. తక్షిణ సాయంగా మృతుల కుటుంబాలకు లక్ష, గాయపడిన వారికి రూ. 50 వేలు ప్రకటించారు. కాగా, సోమవారం ఉదయం సిగాచి పరిశ్రమలో రియాక్టర్ పేలుడు ఘటనలో ఇప్పటి వరకు 36 మంది మృతి చెందారు. మరో 40 మందికిపైగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో మొత్తం 108 మంది ఉండగా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. చాలా వరకు మృతదేహాలు గుర్తు పట్టలేనతంగా కాలిపోయాయి. మార్చురీ వద్ద డెడ్‌బాడీలు ఎవరివో తెలియక బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతుల కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# సిగాచి ప్రమాదంపై హెచ్‌ఆర్‌సీ సుమోటో

(ఎన్‌హెచ్ఆర్‌సీ) సైతం ఫిర్యాదులు అందాయి. బాధితులకు న్యాయం చేయాలని, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రమాద ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, దీనిని సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, జులై 30వ తేదీలోగా నివేదిక సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్, కార్మిక శాఖ కమిషనర్, అగ్నిమాపక శాఖ డీజీ, జిల్లా ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఈ ఘటనపై రామారావు అనే వ్యక్తి జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. సిగాచి పరిశ్రమ డైరెక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘోర ప్రమాదం జరిగిందని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షలు, గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం ఇప్పించాలని ఆయన కమిషన్‌ను కోరారు. దీంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా తెలంగాణలోని అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే ఘటనపై న్యాయవాది కుమారస్వామి సైతం రాష్ట్ర హెచ్ఆర్‌సీకి మరో ఫిర్యాదు చేశారు.

పరిశ్రమలో పాత యంత్రాలను వినియోగించడం, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడమే ప్రమాదానికి ప్రధాన కారణాలని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిగాచి కెమికల్ పరిశ్రమ యాజమాన్యంపైనా, సంబంధిత అధికారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఫ్యాక్టరీలకు ముందుజాగ్రత్త చర్యలపై ఆదేశాలు ఇవ్వాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ వరుస ఫిర్యాదులు, హెచ్ఆర్‌సీ స్పందనతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# స్వల్పంగా తగ్గిన జీఎస్టీ వసూళ్లు

గతేడాది జూన్‌తో పోల్చి చూస్తే ప్రస్తుత వసూళ్లు 6.2 శాతం అధికమని కేంద్రం పేర్కొంది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో రూ.2.37 లక్షల కోట్లు, మే నెలలో రూ.2.01 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి. ఆ గణాంకాలతో పోలిస్తే జూన్‌లో వసూళ్లు కొంత మేర తగ్గాయి. మరోవైపు, దేశవ్యాప్తంగా జీఎస్టీ పన్ను విధానం అమల్లోకి వచ్చి జులై 1 నాటికి విజయవంతంగా 8 సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో జీఎస్టీ వసూళ్లు రెట్టింపు అయ్యాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో రూ.11.37 లక్షల కోట్లుగా ఉన్న మొత్తం జీఎస్టీ వసూళ్లు, 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.20.08 లక్షల కోట్లకు పెరిగాయని వివరించింది.

# సిఫ్ అబాకస్ లో రన్నరప్‌గా నిలిచిన శ్రీ చైతన్య విద్యార్థి తన్విక




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) శ్రీ చైతన్య స్కూల్ లో ఐదో తరగతి చదువుతున్న తన్విక సిఫ్ అబాకస్ పోటీల్లో ఫౌండేషన్ ఫోర్త్ లెవల్‌లో ఫస్ట్ రన్నరప్ గా నిలిచింది. ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి పాఠశాల్లో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 3600 మంది పాల్గొన్న పోటీలో శ్రీ చైతన్య విద్యార్థి ప్రతిభ చాటరని, ఇది గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య ఎజీఎం మహ్మద్ నూర్ అలీ, ఆర్ఐ మల్లికార్జున్



నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కీర్తి, ప్రైమరీ ఇంచార్జ్‌లు రేచల్, నవనిత సేఫ్ అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటిన తన్వికను అభినందించారు.

# గంజాయి అమ్ముతున్న నలుగురు వ్యక్తులు అరెస్ట్

**ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.నవనీత రెడ్డి**

**నిందితుల వద్ద నుంచి 255 గ్రాముల హాష్ ఆయిల్, 475 గ్రాముల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్, కొంపల్లి చుట్టు పక్కల ప్రాంతాలలో పనిచేసే కార్మికులకు, విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు మేడ్చల్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.నవనీత రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడ్చల్ చెక్ పోస్ట్ వద్ద మంగళవారం ఉదయం సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి తమ సిబ్బంది రూట్ వాచ్ నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనాలపై అనుమానస్పదంగా తిరుగుతున్న బాలనగర్ కు చెందిన జనం మహేష్ బాబు, మచ్చబొల్లారానికి చెందిన బద్నాపురం నరేందర్, కూకట్ పల్లికి చెందిన కిస్ట్ పి.ఫిలిప్స్, యాప్రాల్ కు చెందిన పి.షాజీ జార్జిల వద్ద తనిఖీ చేసి వారి వద్ద నుంచి 255 గ్రాముల హాష్ ఆయిల్, 475 గ్రాముల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

# బుర్ఖాతో చోరీ,ఆరున్నర లక్షల రికవరీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో చోరీల్లో కొత్త తరహా మెలకలతో అమాయకులకు టోకరా వేస్తున్న కేటుగాళ్లు.మొన్నీ మధ్య సికింద్రాబాద్ చిలకలగూడ ప్రాంతంలో ఓమహిళా ప్యాంటు,షెర్టు వేసుకొని చోరీకి పాల్పడిన విషయం అందరికి తెలిసిందే!సీసీ కెమెరాలు ఆధారంగా పోలీసులు గంటల వ్యవధిలో అదుపులోకి తీసుకున్నారు.ఇది జరిగి నెల గడవక ముందే మలక్ పేట్ గంజ్ (గ్రేన్ మార్చెంట్ )మార్కెట్లోని ఉల్లిగడ్డల వ్యాపారి అయిన షేక్ ఖుద్దూస్ వ్యాపార నిమిత్తం తన ద్విచక్ర వాహనం లోని డిక్కీలో ఉంచిన 6,50,000/- ల నగదును గుర్తు తెలియని వ్యక్తి బుర్ఖా ధరించిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆ డబ్బును దొంగలించి పారిపోయాడు.తననగదు అపహారణకు గురైందని తెలుసుకున్న వ్యాపారి చాదర్ ఘాట్ పోలీసులకు ఆశ్రయించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.చాదర్ గట్ పోలీసులు వ్యాపారి ఫిర్యాదు స్వీకరించిన సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టగా అసలు నిందితుడు మొహమ్మద్ వాజిద్( 22 ), టాటా ఏసీఈ డ్రైవర్ ను సంతోష్ నగర్ లోని అతడి నివాసంలో అదుపులోకి తీసుకున్న చాదర్ గట్ పోలీసులు.సొంతకారు లేదని ఎలా అయినా కారు కోనాల్సిందేనని,బురా? ఆలోచనతో దొంగ తననానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.అతను గతంలో పనిచేసిన చోటే బురా? ధరించి తన యజమాని వద్ద దొంగతనంకు పాల్పడడంతో వెలుగులోకి వచ్చింది.దొంగిలించిన మొత్తం నగదు, చెక్ బుక్స్ లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ తెలిపారు.24 గంటల్లో కేసును చేదించిన పోలీసులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

24 గంటల్లో పోలీస్ అదుపులో:హైదరాబాద్ మలక్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దిల్ సుఖ్ నగర్ ప్రధాన రహదారి వెంట ఉన్న ప్రముఖ మొబైల్ విక్రయ సంస్థ అయిన బిగ్ సి మొబైల్ లో దొంగతనానికి పాల్పడిన రంజన్ దాస్ (31) సంవత్సరాల నిందితుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన మలక్ పేట్ పోలీసులు.నిందితుడి వద్ద నుండి మూడు లక్షల 40 వేల రూపాయల విలువ చేసే 10 మొబైల్ ఫోన్స్,ఒక బ్లూటూత్ సెట్టును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు రెండు రోజుల క్రితం దిల్ సుక్ నగర్ మెయిన్ రోడ్ లో ఉన్న బిగ్ సి మొబైల్ షోరూమ్ కు గోడకు రంధ్రం చేసి దొంగతనానికి పాల్పడడం జరిగింది.నిందితుడు నీలోఫర్ హాస్పిటల్ సమీపంలో ఫుట్ పాత్ పై జీవనం కొనసాగిస్తున్నాడు.చెడు అలవాటులకుబానిసై,విలాసవంతమైన జీవితాన్నికి గడపడం కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారు.కౌబర్,హామ్మర్ సహాయంతో గోడలకు రంధ్రాలు చేసి రాత్రి సమయం లో మొబైల్ ఫోన్ దొంగతనం చేసే ప్రణాళికలు చేసేవాడని పోలీసులు తెలిపారు.

నిందితుడు పై గతంలో మహంకాళి,మాసబ్ ట్యాంక్,ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదైనట్లు సౌత్ ఈస్ట్ జోన్ పోలీస్ కమిషనర్ చైతన్య కుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.అలాగే ఎంతటి వారైనా నేరం చేస్తే పోలీసుల నుంచి తప్పించుకోలేరన్నారు.

# వల్లభనేని వంశీకి బెయిల్

కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపిన నూజివీడు కోర్టు.. వీరికి రిమాండ్ విధించింది. తాజాగా బెయిల్ మంజూరు చేయడంతో వల్లభనేని వంశీ జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వల్లభనేని వంశీని 2025 ఫిబ్రవరి 13న పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్?లో వల్లభనేని వంశీని అరెస్ట్ చేసిన పోలీసులు అనంతరం విజయవాడకు తరలించారు. కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. అప్పటి నుంచి వల్లభనేని వంశీ జైలులోనే ఉన్నారు. వివిధ ఆరోపణలపై కేసులు నమోదు కావటంతో వల్లభనేని వంశీ అప్పటి నుంచి రిమాండ్ ఖైదీగా ఉంటున్నారు.

జైలులో ఉన్న సమయంలో పలుమార్లు అస్వస్థతకు కూడా గురయ్యారు. మరోవైపు గన్నవరం నియోజకవర్గంలో మట్టి అక్రమ తవ్వకాలకు సంబంధించి వల్లభనేని వంశీకి హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ నిర్ణయంపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లింది. 2019 - 2024 మధ్యకాలంలో గన్నవరం నియోజకవర్గంలో జరిగిన మట్టి అక్రమ తవ్వకాలపై ఏపీ ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక సమర్పించింది. ఈ విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో పీటీ వారెంట్ అమలు చేస్తున్నారంటూ ఏపీ హైకోర్టులో వల్లభనేని వంశీ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన కోర్టు వంశీకి బెయిల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. ప్రభుత్వం పిటిషన్ మీద బుధవారం విచారణ జరిగే అవకాశం ఉంది.

# మా ప్రేమకు అడ్డొస్తే చంపుడే

- కట్టుకున్న భర్త కంటే ప్రియుడే సర్వస్వం
- లవర్ కోసం ఎంతకైనా తెగింపు
- ప్రేమ, పగ, వంచన.. ప్రతీకారం
- మేఘాలయలో హనీమూన్ మర్డర్
- వరుడిని లేపేసిన కర్నూలు యువతి
- లవ్ గివ్ లేదన్నందుకు తల్లిని చంపేసిన మైనర్
- ప్రేమను అడ్డుకున్న తండ్రిని హతమార్చిన కూతుళ్లు
- అరవై ఏళ్లకిందటి ప్రేమ కథల్లో ప్రేమికులు త్యాగ శీలురు



**అప్పట్లో పరువు, ప్రతిష్టల పరదాల్లో దేవదాసు, పార్వతి ప్రేమానుబంధం.. పెద్దరికం వంటివి బందీలు అయ్యాయి. మరో ముప్పై ఏళ్ల తర్వాత ప్రేమ ఖైదీల విముక్తి ఇతివృత్తాలు తెరమీదకు వచ్చాయి. ప్రతీ ప్రేమ కథలోనూ ప్రేమికుడే త్యాగమూర్తి అయ్యాడు. కానీ నేటితరం లవ్ స్టోరీస్ మాత్రం దారుణంగా మారిపోయాయి. ఇక్కడ ప్రియురాలు త్యాగ శీలిగా మారి క్రిమినల్ యాక్టివిటీస్లో చిక్కుకుంటోంది. ప్రియుడి కోసం అమ్మానాన్నలను చంపే నీచ స్థితికి నేటితరం యువతులు దిగజారిపోయారు. అంతేకాకుండా తనను ప్రేమించలేదని ఏకంగా యువకులను చంపేస్తున్న ఘటనలు సంతరించుకుంటున్నాయి. ఈ నయా ఘోర నేరాల్లో అతివలే సూత్రధారులు కావటంతో సభ్య సమాజాన్ని కొత్త ఆందోళన వెంటాడుతోంది.**

**కడుపులో ఆడబిడ్డ ఉందని తెలిస్తే గర్భంలోనే చంపేసే కిరాకతకుల్ని నేటి సమాజం ఈసడించుకుంది. కంటే ఆడపిల్లనే కనాలని, అవసాన దశలో తమ ఆలనపాలన చూసేది.. కన్నీటి వీడ్కోలు పలికేది వారేననే ధోరణికి చాలామంది వచ్చేశారు. ఆడపిల్లలను అల్లారుముద్దుగా పెంచితే.. కన్నవారి ప్రేమను కాదని.. తాత్కాలిక ఆనందం కోసం అర్రులు చాస్తున్నారు. కంటిరెప్పపై కర్కశత్వాన్ని చూపుతున్నారు.**

**ఆప్యాయత, అనుబంధాల వంటివి చితిమంటల్లో బూడిదగా మారుతున్నాయి. ఇంతటి అన్యోన్యమైన ప్రేమ.. పగ, ప్రతీకారాలకు ఎందుకు దారి తీస్తోంది.? అమ్మాయిల్లో క్రూరత్వం.. బరితెగింపు.. సైకోలుగా మారటానికి కారణమేంటీ.? మితి మీరిన స్వేచ్ఛ వారిలో నేర ప్రవృత్తికి దారితీస్తోందా.? ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు, లవ్ స్టోరీస్, మిస్టరీ మర్డర్స్ ట్రెండ్ను పరిశీలిద్దాం.**

**మేడ్చల్ (ప్రశ్నన్యూస్)** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. కసాయి కూతురు కన్న తల్లి అని చూడకుండా ప్రియుడితో కలిసి హత్య చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఎల్బీనగర్లో నివాసముండే సట్ల అంజలీని తన ప్రియుడితో కలిసి గొంతు నులిమి, తలపై కొట్టి కుమార్తె హత్య చేసింది. తన ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలిసి తల్లి మందలించిందనే కోపంతో ఈ దారుణానికి పాల్పడింది. తన ప్రియుడు, అతని తమ్ముడుతో కలిసి హత్యకు పాల్పడింది. కాగా ఆమె పదవ తరగతి చదువుతోంది. సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు నేర స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ హత్యకు పాల్పడిన అందరూ మైనర్లే కావడం గమనార్హం. గత నెల 19న ఇంట్లో నుంచి మైనర్ బాలిక ప్రియుడుతో వెళ్లిపోయింది. దీంతో కూతురు కనిపించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం ప్రియుడు మైనర్ బాలికను తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు అతనికి నోటీసులు ఇచ్చి పంపించారు. ఈ క్రమంలో తల్లిని చంపేయాలని కుమార్తె నిర్ణయించుకుంది. ప్రియుడు, అతని సోదరుడి సహాయంతో తల్లిని హత్య చేసింది. తన ప్రేమకు తల్లి అడొస్తోందనే కోపంతో తల్లిని హత్య చేసింది.

## తండ్రిని కూతుళ్లే చంపేశారు..

ప్రేమకోసం కన్న తండ్రిని కూతుళ్లు చంపేశారు. వీరికి తల్లి సహకరించింది. ఈ దారుణ ఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలో కలవరం సృష్టించింది. మరిపెడ మండలం జెండాల తండాలో కిషన్ కు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె పల్లవి సురేష్ అనే వ్యక్తితో తరచూ ఫోన్లో మాట్లాడుతోంది. గమనించిన తండ్రి పల్లవిని మందలించారు. కానీ అతన్నే పెళ్లి చేసుకుంటానని ఖరాఖండిగా చెప్పేసింది. దీనికి ఒప్పుకోని కిషన్.. కాస్తంత గట్టిగానే బదులు చెప్పాడు. ఐతే తన ప్రేమను ఒప్పుకోవట్లేదని ప్రియుడితో కలిసి తండ్రిని చంపేందుకు పల్లవి స్కెచ్ వేసింది. పల్లవికి తల్లి కావ్య, అక్క రమ్య సహకరించారు. పక్కటెముకలు విరగొట్టి, పిడుగుద్దులతో కిషన్ పైకి దాడి దిగారు ఇద్దరు కూతుళ్లు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కిషన్ మృతి చెందాడు. కిషన్ బంధువుల ఫిర్యాదుతో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## సోనమ్.. సూపర్ క్రిమినల్..



పెళ్లి జరిగిన తొమ్మిది రోజులకే భర్తని హనీమూన్ పేరుతో మేఘాలయకు తీసుకెళ్లి ప్లాన్ ప్రకారం హత్య చేయించిన నవ వధువు సోనమ్, ఆమె ప్రియుడుగా భావిస్తున్న రాజ్ కుష్వాహ కలిసి దిగిన ఫొటో ఒకటి బయటపడింది. వీరిద్దరూ ఎంతో హ్యాపీగా ఆ ఫొటోకి ఫోజులిచ్చారు. రాజా రఘువంశీ హత్య కేసు దర్యాప్తులో తాజాగా బయటపడ్డ ఈ కొత్త ఫొటో ఇండోర్ లోని విజయ్ నగర్ ప్రాంతంలో తీశారని పోలీసులు తేల్చారు. రాజా రఘువంశీ మర్డర్ని ప్లాన్ చేసి ఇంప్లిమెంట్ చేసిన నిందితులంతా జైల్లో ఉన్నారు. రాజాని అన్యాయంగా పొట్టనబెట్టుకున్న వీళ్లు, ఎవరో ఒక స్త్రీని హత్య చేసి శరీరాన్ని పూర్తిగా కాల్చి ఆ డెడ్ బాడీ రాజా భార్య సోనమిదిగా చూపించడానికి ప్లాన్ చేశారని మేఘాలయ పోలీసులు వెల్లడించారు. సోనమ్ కోసం తీవ్రమైన సెర్చ్ ఆపరేషన్ జరుగుతుండటంతో ఈ మర్డర్ ప్లాన్ చేశారు. అయితే, అదృష్టవశాత్తూ మరో అమాయకపు ప్రాణం బలి కాకుండా పోలీసులకు సోనమ్ చిక్కింది.

## తేజేశ్వర్ కథ ప్రారంభం ఇలా...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కల్లూరుకు చెందిన ఐశ్వర్య అలియాస్ సహస్ర అనే యువతి బ్యూటీషియన్గా పని చేస్తోంది. కర్నూలులోని స్టేట్ బ్యాంకు ఉద్యోగి వివాహితుడు తిరుమలరావుతో ప్రేమబంధం పెంచుకుంది. ఇంతలో ఆమెకు పెళ్లి చేయాలని తల్లి ప్రయత్నాలు ప్రారంభించింది. తల్లి సుజాత కూడా బ్యాంకులో స్వీపర్ గా పని చేస్తోంది. ఐశ్వర్య తండ్రి రామకృష్ణ గతంలోనే మృతి చెందారు. జోగులాంబ గద్వాలలోని రాజావీధి నగర్కు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి గంటా జయరాం, శకుంతల అనే దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు (కవలలు) కుమారులున్నారు. చిన్న కుమారుడు గంటా తేజేశ్వర్ ప్రైవేటు సర్వేయర్గా పనిచేస్తున్నాడు. ఇక ఐశ్వర్యకు, తేజేశ్వర్ కు పెళ్లి కుదిరింది. ఈ ఏడాది ఫిబ్రవరి 13న గద్వాలలో పెళ్లికి పూర్తిగా ఏర్పాట్లు చేయగా, ఐశ్వర్య అకస్మాత్తుగా ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో పెళ్లి ఆగిపోయింది. పీటల మీద పెళ్లి ఆగిపోయిందని తేజేశ్వర్ మానసికంగా కుంగిపోయాడు. ఎందుకంటే అప్పటికే తేజేశ్వర్ ఆమెతో ప్రేమలో పడ్డాడు. సడెన్గా మ్యారేజ్ క్యాన్సిల్ కావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అప్పటి నుంచి ముభావంగానే ఉంటున్నాడు.

## ఆమె పలకరింపుతో...

అనూహ్యంగా మేనెలలో ఐశ్వర్య నుంచి తేజేశ్వర్కు ఫోన్ వచ్చింది. తన తల్లి కట్నం ఇచ్చుకోలేదని, కట్నం ఇచ్చేందుకు ఆమె పడుతున్న ఇబ్బందులు చూడలేకే తాను ఇంట్లో నుంచి వెళ్లిపోయాయని నమ్మించింది. ఆమె చెప్పిన మాటలను పూర్తిగా నమ్మిన తేజేశ్వర్, తన తల్లిదండ్రులు వద్దని చెప్పినా, కట్నకానుకలు ఏమీ తీసుకోకుండా మే 18న గద్వాల జిల్లాలోని బీచ్పల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ఆమె మెడలో మూడు ముళ్లు వేశాడు. బంధువుల సూచనతో తేజేశ్వర్ తల్లిదండ్రులు కూడా పెళ్లికి హాజరై వధూవరులిద్దరినీ ఇంట్లోకి అనుమతించారు. అకస్మాత్తుగా వరుడు కిడ్నాప్ జూన్ 17న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తేజేశ్వర్ ఉన్నట్టుండి కనిపించకుండా పోయాడు. దీంతో అంతటా వెతికినా అతని జాడ తెలియకపోవటంతో 18వ తేదీన గద్వాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరా ఫుటేజీ, టెక్నాలజీ ఆధారంగా దర్యాప్తు కొనసాగించగా, కొందరు వ్యక్తులు అతన్ని కారులో ఎక్కించుకుని తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఏపీలోని ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్ ప్లాజా దాటి వెళ్లిన ఆ కారు, తిరిగి కర్నూలు వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. దీన్ని ఆధారంగా చేసుకుని నంద్యాల జిల్లా పోలీసులకు సమాచారం ఇవ్వగా, పాణ్యం పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో 21వ తేదీ రాత్రి నంద్యాల జిల్లా పాణ్యం పరిధిలోని పిన్నాపురం పరిధిలో గాలేరునగరి కాల్వలో తేజేశ్వర్ మృతదేహం లభించింది. దీంతో స్థానిక పోలీసులు గద్వాల ఠాణాకు సమాచారమిచ్చారు. హత్య చేసి చంపేసినట్లు పోలీసులు నిర్ధారించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు పోస్టుమార్టం చేయించారు.

## అసలు కథ ఇది..



తేజేశ్వర్ మృతిపై భార్య ఐశ్వర్య పైనే కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే కర్నూలులోని ఎస్బీఐ సర్కిల్ వద్ద ఉండే ఓ బ్యాంకు హౌసింగ్ మేనేజర్తో కలిసి ఐశ్వర్య ఈ హత్య చేయించిదనే ఆరోపణల మేరకు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. తేజేశ్వర్ భార్య ఐశ్వర్య మార్చి నుంచి జూన్ వరకూ సుమారు 2 వేల సార్లు బ్యాంకు మేనేజర్తో గంటల తరబడి ఫోన్లో మాట్లాడినట్లుగా కాల్ రికార్డులను బట్టి తేలింది. బ్యాంకు మేనేజర్కు అప్పటికే పెళ్లైంది. కానీ తేజేశ్వర్తో నిశ్చితార్థం జరిగిన తర్వాత బ్యాంకు ఉద్యోగినే పెళ్లి చేసుకోవాలని ఐశ్వర్య భావించింది. అందుకే ఫిబ్రవరిలో తేజేశ్వర్తో పెళ్లి జరగాల్సిన సమయంలో కనిపించకుండా పోయి పెళ్లి రద్దుకు కారణమైంది.

## పక్కా ప్లాన్..

తేజేశ్వర్తో ఐశ్వర్యకు పెళ్లి నిశ్చయం కాగానే, బ్యాంకు మేనేజర్ తిరుమలరావు ఆమెను తన ఇంటికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో అతని కుటుంబంలో ఘర్షణలు తలెత్తడంతో ఐశ్వర్యకు అక్కడ ఉండటం వీలుకాలేదు. బ్యాంకు మేనేజర్తో పెళ్లి కుదరకపోవడంతో తిరిగి మళ్లీ తేజేశ్వర్ వద్దకు వచ్చేసింది. దీంతో తిరిగి తేజేశ్వర్నే పెళ్లి చేసుకోవడానికి ప్లాన్ ప్రకారమే నిర్ణయించుకుంది. తర్వాత కర్నూలు లోనే కాపురం పెడితే ప్రియుడు తిరుమలరావును ఎప్పటిలా కలుసుకోవచ్చని కుట్ర పన్నింది. తేజేశ్వర్ గద్వాలలోనే కాపురం పెట్టడంతో ప్రియుడిని కలుసుకోవడం వీలు కాలేదు. తేజేశ్వరు మర్డర్ చేయించేందుకు ఐశ్వర్య, తిరుమలరావు కర్నూలుకు చెందిన ఓ సుపారీ గ్యాంగ్తో ఒప్పందం చేసుకున్నారు. ఆ గ్యాంగ్ ముందస్తు ప్రణాళిక ప్రకారం తమ భూమి సర్వే చేయాల్సి ఉందని ఈ నెల 17న తేజేశ్వరు సంప్రదించారు. నమ్మిన తేజేశ్వర్ వారితో కారులో వెళ్లారు. తొలుత ఇటిక్యాల మండలం మొగలిరావు చెరువు వైపు, తర్వాత గద్వాల మండలం వీరాపురం కారులో అతన్ని తీసుకెళ్లారు. అక్కడే కృష్ణస్వామి ఆలయం సమీపంలో కారులోనే మారణాయుధాలతో అతి కిరాతంగా చంపినట్లు సమాచారం. అక్కడి నుంచి ఎర్రవెల్లి మీదుగా గుర్రం గడ్డ వద్ద నేషనల్ హైవేలో యూటర్న్ తీసుకుని కృష్ణా నదిలో హత్య చేసిన ఆయుధాలను, తేజేశ్వర్కు ల్యాప్టాప్, సెల్ఫోన్లను పడేశారు. అనంతరం అలంపూర్ మండలం బైరాపురం దారి గుండా పంచలింగాలకు చేరుకున్నారు.

## ఐశ్వర్య తల్లితోనూ తిరుమలరావు సెటప్..

తిరుమలరావు అక్కడికి చేరుకుని, తేజేశ్వర్ మృతిని నిర్ధారించుకుని, సుపారీగ్యాంగు కొంత నగదు ఇచ్చినట్లు సమాచారం తెలిసింది. అక్కడి నుంచి ఏపీలోని నంద్యాలకు దగ్గర్లోని పాణ్యం అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన తేజేశ్వర్ మృతదేహాన్ని దుండగులు పడేశారు. పెళ్లయిన 29 రోజుల్లో దాదాపు 15 రోజులు ఐశ్వర్య కర్నూలులోనే ఉండటం ఇది అసలు ట్విస్టు. బ్యాంకు ఉద్యోగితో 4 నెలల్లో దాదాపు 2 వేల వరకు ఫోన్కాల్స్, వందల ఎస్ఎంఎస్లు చేసినట్లు డాటా ద్వారా తెలిసింది. మరోవైపు ప్రధాన నిందితుడికి ఐశ్వర్య తల్లితో కూడా వివాహేతర సంబంధం ఉండటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది

# మాదిగల హక్కుల కోసం మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ను స్థాపించారు : ఎన్.వై అశోక్

**ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తాం : డబిల్ పురం పరశురాం**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాలు పూర్తి చేసుకుని 31వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నెల 7వ తేదిన ప్రతి గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు, జాతీయ కళా మండలి అధ్యక్షులు ఎన్.వై.అశోక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్.వై అశోక్ మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ను స్థాపించారని అన్నారు. సమాజంలో ఎన్నో ఉద్యమాలు చేసిన ఘనత మంద కృష్ణ మాదిగకే దక్కిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నెల 7న గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేసి ఆయా గ్రామాలలో పండుగ వాతావరణం తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మేడ్చల్ మండల మాజీ అధ్యక్షుడు, నాయకుడు డబిల్ పురం పరశురాం మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 30 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రతి గ్రామంలో నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నూతన కమిటీల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డబిల్ పురం పరశురాం మాదిగ, రామకృష్ణ మాదిగ, జీడిపల్లి బాలకృష్ణ మాదిగ, సంబు



ప్రభాకర్ మాదిగ, బాలనర్సింహ మాదిగలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# అఖిలభారత సమ్మెలో పాల్గొంటామని అంగన్వాడీలు,.

**అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్..**

**జిల్లా ప్రధాన కార్యదర్శి జి. జ్యోతి..**



మంథని ( ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 నిర్ణయించాలని పర్మినెంట్ చేయాలని ఎనిమిది గంటల పని విధానం ఉండాలని తదితర డిమాండ్స్ పరిష్కారానికై జులై 9న జరిగే అఖిల భారత సమ్మెలో మంథని ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు పాల్గొంటారని ఈరోజు ఐసిడిఎస్ అధికారులకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్( సిఐటియు) ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి జ్యోతి సిఐటియు జిల్లా నాయకుడు బూడిద గణేశ్ పాల్గొన్నారు.. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేయడం వల్ల అంగన్వాడీలు సమస్యలపై అడిగే హక్కును కూడా కోల్పోతారని చట్టబద్ధత చట్టబద్ధ సౌకర్యాలకు అంగన్వాడీలను దూరం చేసే కుట్ర జరుగుతుందని అన్నారు దేశవ్యాప్తంగా జరిగే ఈ సమ్మెలో అంగన్వాడీలు పాల్గొనడం ద్వారా హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు..

# పేద విద్యార్థులకు "సాయిరూప ట్రస్ట్" ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ

**- పేద విద్యార్థులు సైతం ఉత్తమ విద్యను పొందాలన్నదే ట్రస్ట్ లక్ష్యం**

**- ట్రస్ట్ సభ్యులు : కోయల్కార్ సుజాత-మస్తాన్**

**- మహాలక్ష్మీ వీధిలో సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమం**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మీ వీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం "సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సేవా సమితి" ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కోయల్కార్ సుజాత – మస్తాన్ దంపతులు,ఎద్దండి సరళ – రాజు,బోడిగే రజనీ – రాజు,తోట రాజు,కొండ శేఖర్, వేముల సతీష్,భూతల సాయి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయశ్రీ,



ఉపాధ్యాయులు కిషన్,అంగన్వాడి టీచర్ సరళ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు కోయల్కార్ మస్తాన్ మాట్లాడుతూ "పేద విద్యార్థులు కూడా మంచి విద్యను పొందాలన్నదే మా ట్రస్ట్ లక్ష్యం. పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరిగేలా ఇలాంటి చిన్న ప్రోత్సాహక సహాయాలు అవసరం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం" అని తెలిపారు. విద్యార్థుల్లో ఆనందం నెలకొనగా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ట్రస్ట్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కళాకారుల హక్కుల సాధనకు కృషి చేస్తా

**- తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కళాకారుల జిల్లా అధ్యక్షులు**

**- కత్తెరపాక శ్రీనివాస్**

**- తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా కత్తెరపాక శ్రీనివాస్ ఏకగ్రీవం**




బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కళాకారుల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా బోయినిపల్లి మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన ధూంధాం కళాకారుడు కత్తెరపాక శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ఇంచార్జి సిద్దిపేట శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కత్తెరపాక శ్రీనివాస్ మాట్లాడుతూ,"తెలంగాణ ఉద్యమంలో కళాకారులు తమ కళా ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం రేపారు. బతుకుబండా నాటకాలతో, పాటలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి నూరిపోశారు.

కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారి త్యాగాలను గౌరవించాల్సిన అవసరం ఇంకా మిగిలే ఉంది. ప్రతి మండలంలో కళాకారుల కోసం ప్రత్యేక నిధులు, స్థిర ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. నా అధ్యక్షతన జిల్లా కళాకారుల హక్కుల కోసం గళం విప్పుతాను. రాష్ట్ర వ్యాప్తంగా ఒకతాటిపై మన గొంతు వినిపించేందుకు నిబద్ధంగా పనిచేస్తాను," అని తెలిపారు. అలాగే తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న, అనువోజు వెంకటేశం, నకిరేకంటి కిరణ్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు పొందుర్తి ధర్మేందర్,మాట్ల కుమార్, అశోక్, మహేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- జిల్లా కలెక్టర్ : సందీప్ కుమార్ ఝా**

**- చింతల్ ఠాణా ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం తనిఖీ**

వేములవాడ, (ప్రశ్న న్యూస్) విద్యాలయాల్లోని ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి బోధించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మండలం, చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులను,అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. పాఠశాల భవనం అంతస్థు పైన కిచెన్ షెడ్ నిర్మించాలని, వెంటనే పనులు ప్రారంభించి, సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో నిత్యం చదవడం,రాయడంపై ప్రత్యేక దృష్టి సారించి,నిత్యం అభ్యాసన చేయించాలని కలెక్టర్ సూచించారు. డెస్క్ లు తక్కువగా ఉండడంతో, వేరే పాఠశాల నుండి తెప్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

**- అంగన్వాడీ కేంద్రం అకస్మిక తనిఖీ**



చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత మంది చిన్నారులు ఉన్నారు? ఈరోజు ఎంత మంది వచ్చారనే వివరాలను ఆరా తీశారు. అర్హులైన పిల్లలందరికీ బాలామృతం, కోడిగుడ్లు



అందరికీ అందించాలని నిర్వాహకులకు సూచించారు. చిన్నారుల ఎత్తు,బరువును కొలిచి పరిశీలించారు. చిన్నారుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్,రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోయినిపల్లిలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

**- 500 మందికి పైగా వైద్య సేవలు**



బోయినపల్లి,(ప్రశ్న న్యూస్) "డాక్టర్స్ డే"ను పురస్కరించుకొని బోయినిపల్లి మండల కేంద్రంలోని చెన్నాడి రాధమ్మ ఫంక్షన్ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరాన్ని ఐఎంఏ సిరిసిల్ల, ఎఫ్ఓజీఎస్ఐ కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని జగిత్యాల జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్ మోహన్ రావు



ప్రారంభించారు. ఈ శిబిరంలో దాదాపు 500 మందికి పైగా రోగులు వివిధ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో గైనకాలజీ, జనరల్ మెడిసిన్, దయాబెటిస్, బీపీ వంటి విభాగాల్లో సేవలు అందించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులను గుర్తింపు



అందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. శ్రీనివాస్, డాక్టర్ ఎన్. పద్మలత, డాక్టర్ అభినయ్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్వప్న, డాక్టర్ సంతోష్ రమణారావు, డాక్టర్ నల్ల మధు, డాక్టర్ రజని, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ సతీష్, డాక్టర్ అజిత్ కుమార్, డాక్టర్ నాగార్జున, డాక్టర్ శశిధర్, బోయినిపల్లి ఆర్ఎంపీ డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భాజపా రాష్ట్ర నూతన రథసారథి రాం చందర్ రావు నాయకత్వం శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్నిస్తుంది

**- వేములవాడ భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపిన భాజపా శ్రేణులు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్సీ బస్వరాజు రాంచందర్ రావుకు శుభాకాంక్షలు తెలుపుతూ వేములవాడ భాజపా పట్టణాధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ బీజేపీ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ లు తదితర భాజపా శ్రేణులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపి,రాజన్న లడ్డూ ప్రసాదం అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ, "రాష్ట్ర అధ్యక్షులుగా రాంచందర్ రావు బాధ్యతలు చేపట్టడం బీజేపీ శ్రేణులకి కొత్త ఉత్సాహాన్ని, నూతన దిశానిర్దేశాన్ని ఇస్తుంది. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుంది" అన్నారు. అనంతరం ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, "రాష్ట్ర బీజేపీ పగ్గాలు రాంచందర్ రావు చేపట్టిన నేపథ్యంలో పార్టీ మరింత బలోపేతమై ప్రజల మధ్యకి మరింత చేరువవుతుంది" అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భాజపా శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుడు మల్లయ్య దహన సంస్కారాలకు తూడి లచ్చన్న సేవానిరతి



గంగాధర, (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం,మల్లాపూర్ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది కోలేపాక మల్లయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన నేపథ్యంలో ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త,టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న మృతుడు మల్లయ్య అంత్యక్రియల కోసం తక్షణ సహాయంగా టీఎల్ యువసేన సభ్యుల చేతుల మీదుగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు లచ్చన్న సానుభూతి భావాన్ని అభినందించారు. గ్రామస్థుల మధ్య సహకారం, సానుభూతి భావం ఈ సందర్భంగా మరోసారి చాటుకుంది.

# జోనల్ కమిషనర్ కి వినతి పత్రం - భాజపా నేత తిరుపతి

**మానస సరోవర్ ఫేస్ 2 లో స్ట్రీట్ లైట్స్ ప్రాబ్లం:తిరుపతి**

**ప్రజల సమస్యలు పట్టవ, మున్సిపల్ అధికారులకు**

**లక్షల్లో పన్నులు వసూలు, అభివృద్ధి మాత్రం శూన్యం**

**మౌలిక సమస్యలతో లబో దిబో మంటున్న కాలనీ వాసులు**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) కూకట్పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్ పిల్లి డివిజన్ ప్రాంతంలో ఉన్న మానస సరోవర్ ఫేస్ టూ లో పలు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అపార్టుమెంట్ వాసులు బిజెపి సీనియర్ నాయకుడు ఏనుగుల తిరుపతి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గతకొంతకాలంగా వీధి దీపాలు మసక మసక బారిన విద్యుత్ దీపాలు ఉండడంతో వయస్సు మీద పడిన మహిళలు, పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారుఏడోందల కుటుంబాలు నివసిస్తున్న మానస సరోవర్ ప్రాంతంలో వెలుగు పోయి వెన్నెల నీడలో ప్రయాణం చేస్తున్నట్లు స్థానికులు చెబుతుంటే బాధేసిందనిభాజపా నాయకులు ఏనుగుల తిరుపతి వాపోయారు. అలాగేరెండు రోజుల క్రితం మానస సరోవర్ అపార్ట్మెంట్ ఫేస్ 2 కి సంబంధించిన కాలనీ వాసులు సొసైటీ మీటింగ్ ఏర్పాటు చేసి అక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని డిఈ అధికారి స్వప్నని కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించారన్నారు,మిగతా సమస్యల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడడంతో వారు కూడా త్వరలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారని ఆయన అన్నారు.

స్థానికంగా నెలకొన్న మౌళిక సదుపాయాల విషయంలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని అపార్ట్మెంట్ వాసులకు హామీ ఇచ్చిన విషయం విదితమే! కానీ నిన్న సొసైటీ సభ్యులు మకరంద్ తో బిజెపి నాయకుడు ఏనుగుల తిరుపతి,రమేష్ వరుణ్ అందరూ కలిసి స్థానికంగా నెలకొన్న మౌళిక సదుపాయాల విషయంలో పరిష్కారం కోసం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ని కలిసి ఎంపి ఈటెల రాజేందర్ వినతి పత్రం అందజేసికమిషనర్ వెంటనే స్పందించి సంబంధింత అధికారులకు ఆదేశాలు ఇచ్చి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. అదిగాక ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ సమస్యల వలయంగా మారి, మౌళిక ఇబ్బందులకు కేంద్ర బిందువు అయినట్లు,భూ గర్భ డ్రైనేజీ,రోడ్లు,వీధి దీపాలు, అలాగే వీధి కుక్కలబెడదతో పాటు,ఎక్కడ పడితే అక్కడ చెత్తి డంపింగ్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు భాజపా సీనియర్ నాయకుడు ఏనుగుల తిరుపతి పేర్కొన్నారు.

## నాంపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో

# జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారి అనుబంధ దేవాలయమైన ప్రసిద్ధి చెందిన నాంపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, ఆలయ ప్రధాన పూజారి ఎస్పీకి ఘనంగా స్వాగతం పలికి స్వామి వారి ఆశీర్వచనం కల్పించారు.పూజా కార్యక్రమం అనంతరం స్వామివారి ఆశీస్సులు అందుకొని,జిల్లా శాంతి భద్రతల కొరకు ప్రత్యేకంగా ప్రార్థించారు.వారి వెంట వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, తదితర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ములుగు నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి భారీగా నిధులు



ములుగు (ప్రశ్న న్యూస్) ములుగు నియోజకవర్గం లోని దేవాలయాలకు భారీగా నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంజూరుకు కృషి చేసిన మంత్రి సీతక్క కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ దేవాలయాల అభివృద్ధి కోసం రూ.1.42 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం మంత్రి సీతక్క కృషితో మంజూరైన నిధులు సీజీఎఫ్ నిధుల నుంచి రూ.1.42 కోట్లు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ జానకి రామాలయానికి రూ.12 లక్షలు, కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ ఆలయానికి రూ. 50 లక్షలు ములుగు మండలం జగ్గన్నపేట పుట్టా మల్లిఖార్జున స్వామి దేవాలయానికి రూ.30 లక్షలు, మల్లంపల్లి లోని వెంకటేశ్వర స్వామి దేవాలయానికి రూ.20 లక్షలు, ములుగు పట్టణంలోని నాగేశ్వర స్వామి దేవాలయానికి రూ.20 లక్షలు, రామాలయానికి రూ.10 లక్షలు మంజూరు త్వరలో టెండర్లు పిలిచి అభివృద్ది పనులు అప్పగించనున్న అధికారులు నిధులు మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మరియు పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖా మాత్యులు సీతక్క కు ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నైపుణ్యమైన భోధనను అందించాలి..! ప్రథమ సంవత్సర ప్రవేశాలను పెంచాలి..!!

**- డీ.ఐ.ఈ.ఓ.: శ్రీనివాస్**

**- ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డి.ఐ.ఈ.ఓ)వై. శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ తరగతి గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థుల అభ్యాస పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మట్లాడుతూ పాఠాల్లో ఆవశ్యకత అయిన మార్గదర్శకాలను అందించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రథమ సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాలను మరింతగా పెంచేందుకు కృషి చేయాలని, నైపుణ్యపూరిత బోధనకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శరత్ కుమార్, అధ్యాపకులు శేఖర్, జలపతి, మహేందర్, రవీందర్, జయభరత్ రెడ్డి, గోపి, సంతోష్, నరసింహమూర్తి, అంజయ్య, మహేందర్ రెడ్డి, అశోక్, లత, మంగమ్మ,స్వప్న, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు డెస్క్ లు ఏర్పాటు

**- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీలోని స్కూల్ కు తరలింపు**

**- ఉదయం సందర్శన..! మధ్యాహ్నం సౌకర్యాల ఏర్పాటు**




వేములవాడ,(ప్రశ్న న్యూస్)వేములవాడ అర్బన్ మండలం, చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు మరిన్ని డెస్క్ లు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేయగా తక్షణమే అమల్లోకి వచ్చాయి. డెస్క్ లు వేరే పాఠశాల నుంచి తెప్పించాలని పాఠశాలను సందర్శించిన సందర్భంగా సూచించగా, విద్యా శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన తరలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా డెస్క్ లు ఏర్పాటు చేయడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# మొన్న పట్ట పగలు తాగచ్చి ఇంటిని గుద్దే నిన్న అర్ధరాత్రి ఇంటి ముందున్న బాదం చెట్టును గుద్దే

**సౌకర్యవంతంగా రోడ్డు వేస్తున్నారు అనుకున్నాం కానీ, చచ్చిపోయేటట్టున్నం**







ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) ఆరు ప్రమాదాలు పన్నెండు పంచాయతీలు అన్నట్లు తయారైంది. వెంకటాపూర్ లో గుర్రపు మాల ఇండ్ల వద్ద జరుగుతున్న ప్రమాదాలు. నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో దద్దరిల్లుతున్నారు ఆ గల్లీ వాసులు. గత సంవత్సరం బతుకమ్మ పండుగ సమయంలో రోడ్డు నుంచి నేరుగా బతుకమ్మ ఆడుతున్న వారిని తగులుకుంటూ ఇంట్లోకి దూసుకొచ్చిన కారు ప్రమాదం గురుతులు మరువక ముందే, తప్పదాగి మిట్ట మధ్యాహ్నం మరోసారి వెంకటాపూర్ బైపాస్ నుంచి నేరుగా అదే ఇంటిలోకి కారు దూసుకుని పోయింది. వెంకటాపూర్ కు చెందిన వాగుమడి రాజయ్య మనవరాలు మహా వర్షిని చైత్ర టీవీ చూస్తున్నారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డు నుంచి వెంకటాపూర్ వైపు వచ్చిన షిఫ్ట్ డిజైర్ కారు వేగంగా వాగుమడి రాజయ్య ఇంటిలోకి దూసుకెళ్లింది. టీవీ చూస్తున్న పిల్లలు ఒక్కసారిగా ఉలిక్కిపడి కేకలు పెట్టడంతో ఇరుగుపొరుగువారు చిన్నారుల ముగ్గురిని బయటకు తీశారు. గతంలో జరిగిన ప్రమాదం లాగే ఇల్లు ధ్వంసం అయింది. ప్రమాదాన్ని మరవకముందే అర్ధరాత్రి ఇంటి ముందు ఉన్న బాధాం చెట్టును బొలెరో వాహనం ఢీ కొట్టింది. గతేడాది ఆటో, కారు నాల్గు రోజుల క్రితం ఇంట్లోకి దూసుకెళ్లిన కారు, మంగళవారం రాత్రి 2 గంటలకు బొలెరో వాహనం అదే ఇంటిముందు చెట్ట ఢీకొట్టడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ప్రమాదకరంగా వెంకటాపూర్ -రగుడు ఫోర్ లైన్ బైపాస్ రోడ్డు ఉన్నందువల్ల తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి బొలెరో వాహనం ఠాణాకు తరలించి పోలీసులు విచారణ ప్రారంభించారు.

**సౌకర్యవంతంగా రోడ్డు వేస్తున్నారు అనుకున్నాం కానీ, చచ్చిపోయేటట్టున్నం సారు**

రోడ్డు ఎదురుగా ఉన్న కాలనీవాసులు ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యవంతంగా రోడ్డు వేస్తున్నారు అనుకున్నాం కానీ, చచ్చిపోయేటట్టున్నం సారు అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. అధికారులు రక్షణ ఏర్పాట్లు చేయాలని లేకుంటే తమకు వేరే చోట ఇండ్ల స్థలం ఇప్పించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

**నాలుగు లైన్ల రోడ్డు వస్తుందని సంబరపడ్డారు..**

నాలుగు లైన్ల రోడ్డు ఆ కాలనీవాసుల ప్రాణాలు ఎప్పుడు తీస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇంటి ముందు నుంచి వాహనాలు బుయ్యి మంటూ మలుపు తిప్పుకునే గ్రామంలో భారీగా వస్తున్న శబ్దాలు వారి కి నిద్ర లేకుండా చేస్తున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటూ ఉండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నాం అంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ లో బైపాస్ రోడ్డు వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలైన మెడికల్ కళాశాల, కస్తూరిబా పాఠశాల, ఇతర పారిశ్రామిక నిర్మాణాల ఏర్పాటు చేసిన క్రమంలో వాటిని కలుపుతూ వెళ్లే వెంకటాపూర్ రాగుడు బైపాస్ ఫోర్ లైన్ రోడ్డు అనేక మందికి ఇబ్బంది కలగకుండా సౌకర్యవంతమైన ప్రయాణానికి అనువుగా తయారైంది. సదరు రోడ్డుకు ఎదురుగా ఉన్న గల్లీ వాసులు మాత్రం ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతికిడుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రక్షణ ఏర్పాట్లు చేయాలని వేడుకుంటున్నారు.

# వేములవాడ నియోజకవర్గ పలు దేవాలయాలకు రూ.1.95 కోట్లు నిధులు మంజూరు

**- ఆది శ్రీనివాస్, కొండా సురేఖ, సీఎం సహకారంతో నిధుల కేటాయింపు**

**- ప్రజల హర్షం- ప్రత్యేక కృతజ్ఞతలు**

వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రముఖ దేవాలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి,మరమ్మత్తుల కోసం తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ రూ.1 కోటి 95 లక్షల రూపాయల నిధులను సీజీఎఫ్(కామన్ గుడ్ ఫండ్-సామాన్య సంక్షేమ నిధి) కింద మంజూరు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషి ఫలితంగా ఈ నిధులు లభించాయి.

**మంజూరైన నిధుల వివరాలు**

కథలాపూర్ మండలం - సిరికొండ గ్రామం : శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి రూ.50 లక్షలు

- శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రూ.50 లక్షలు

**- మేడిపల్లి మండల కేంద్రం**

శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి రూ.45 లక్షలు

**- వేములవాడ అర్బన్ - మారుపాక గ్రామం**

శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయానికి రూ.50 లక్షలు

ఈ నిధులతో ఆయా ఆలయాల్లో పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం వేములవాడలో దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం అభివృద్ధి కోసం రూ.150 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే.

లి"వేములవాడ నియోజకవర్గ ప్రజల అభ్యున్నతి మాత్రమే కాదు...ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన దేవాలయాల అభివృద్ధికీ కట్టుబడి ఉన్నాం,"లి అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆయా ఆలయాలకు నిధులు మంజూరు చేయడంలో ఆది శ్రీనివాస్ తీసుకున్న చొరవపై భక్తులు, ఆయా గ్రామస్తులు విప్ ఆది,సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సురేఖ లకు హర్షం వ్యక్తం చేసి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# వామ్మో.. మైనర్ల డ్రైవింగ్..! జాగ్రత్తే శ్రేయస్కరం..!!

**- ఓ యువతా...!బండి మీదకాదు-బాధ్యతపై దృష్టి పెట్టండి**

**- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్**





వేములవాడ, (ప్రశ్న న్యూస్) వయసుకు రాని పిల్లల చేతుల్లో వాహనాలు ప్రాణాలను బలితీస్తున్నాయి. సరదాగా బండిపై ఊగిపోతున్న చిన్నారులు శవాలుగా మారుతున్న వాస్తవం గుండెను కలిచేస్తోంది. సరైన శిక్షణ, వయస్సు, అవగాహన లేని వారిచేతుల్లో వాహనం ప్రమాదకర ఆయుధంగా మారుతుందని వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ యువతను హెచ్చరించారు. "వాహనం అనేది ఆటబొమ్మ కాదు. 18 ఏళ్ల లోపు డ్రైవింగ్‌కు అనుమతించవద్దు. మైనర్ల చేతుల్లో వాహనాలు పెడితే తల్లిదండ్రులే బాధ్యత వహించాలి. బాధాకర ఘటనల తర్వాత కళ్ళతడి పెట్టుకోవడం కంటే ముందే జాగ్రత్తలు తీసుకోవాలి" అని ఆయన హెచ్చరికలు చేశారు."చేతికందిన పిల్లలు... శవాలుగా మారుతుంటే!" తల్లిదండ్రులు తాము పడిన కష్టాలను లెక్కచేయకుండా పిల్లల భవిష్యత్తు కోసం ధనాన్ని వెచ్చిస్తున్నారు. కానీ అదే తల్లిదండ్రులు వాహనాల మీద మోజుతో పిల్లలకు బండ్లు కొని పెడుతుంటే, కొన్నిసార్లు అదే బండ్లు వారి పిల్లలను చిరకాలంగా దూరం చేసేస్తున్నాయి. "అమ్మా బయటికి వెళ్తా" అన్న క్షణం తరువాతే, మృతదేహంగా తలుపు తట్టే పరిస్థితులు తల్లిదండ్రులను జీవచ్ఛవాలుగా మారుస్తున్నాయి.



**"రోడ్డుపైకి వస్తే కేసులే..!" - సీఐ వీరప్రసాద్ హెచ్చరిక**

కాలేజీ విద్యార్థులు బైకులపై పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తొలిసారిగా జరిమానా, కౌన్సెలింగ్. మళ్లీ పట్టుబడితే వాహనాల లైసెన్సు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు తమ బాధ్యతను గుర్తించి, వాహనాలను అప్పగించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ యువత తల్లిదండ్రులను కోరారు.

# ఎంపి రామ సహాయం సింప్లిసిటీ

**రోడ్డు పక్కన క్యాన్వాయ్ ఆపి టిఫిన్ చేసిన ఎంపి**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల జీవితం ఎంత విలాసవంతంగా ఉంటుందో మనకు తెలియంది కాదు కూర్చున్న చోటే కోరుకున్నవన్నీ సమకూరతాయి. వారి పర్యటనల సమయంలో కూడ మాములు హడావుడి ఉండదు పోలీసులు, భద్రతా సిబ్బంది, చుట్టు ఉండే అభిమానులతో హడావిడి కనిపిస్తుంది. కానీ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి చాలా సింపుల్‌గా కనిపించారు. జోరుగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో పర్యటించారు. ఇదే క్రమంలో గౌండ్ల రామవరం ప్రభుత్వ పాఠశాల ఎదురుగ ఓ పాకలో జయలక్ష్మి అనే మహిళా నిర్వహిస్తున్న టిఫిన్ సెంటర్ వద్ద తన కాన్వాయ్ ఆపి ఎలాంటి హడావుడి లేకుండా అక్కడ జయలక్ష్మి ఇచ్చిన గారెలు చెట్నీ వేసుకుని తిన్నారు. గారెలు చాలా బావున్నాయంటూ తన వెంట ఉన్నవారికి చెప్పారు. తన హొటల్‌కు వచ్చింది ఎంపి అని తెలుసుకున్న జయలక్ష్మి తాను మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ అభిమానినే అని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలనీ కోరారు. అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని వచ్చే విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా చూస్తామని ఎంపి హామీ ఇవ్వడంతో జయలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు.



# తమ్ముడు మీదే వీళ్లందరి ఆశలు

ఇంకో మూడు రోజుల్లో విడుదల కాబోతున్న తమ్ముడు మీద నిర్మాత దిల్ రాజు, దర్శకుడు వేణు శ్రీరామ్ సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నారనే విషయం నిన్న ఈవెంట్ లో అర్థమైపోయింది. ముందు రోజే ప్రీమియర్లు వేయడం రిస్కని తెలిసినా దానికి సిద్ధపడటం చూస్తే నమ్మకం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమా సక్సెస్ మీద ఒకరిద్దరు కాదు ఎందరో ఆశలు పెట్టుకున్నారు. ముందుగా చెప్పుకోవాల్సింది నితిన్ గురించే. గత కొన్నేళ్లుగా వరస ఫ్లాపులతో బాగా లోగా ఉన్న తనకు అర్జెంట్ గా బ్లాక్ బస్టర్ పడాలి. ఖైదీ తరహాలో కనిపిస్తున్న తమ్ముడు కంటెంట్ కనక వరాన్ ... కనెక్ట్ అయితే బాక్సాఫీస్ వసూళ్లు క్యూ కట్టేస్తాయి. కాంతార ఫేమ్ సప్తమి గౌడ తమ్ముడుతోనే టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఇది సక్సెస్ అయితే మరిన్ని అవకాశాలు తలుపు తడతాయి. చాలా గ్యాప్ తీసుకున్న సీనియర్ హీరోయిన్ లయ ఇందులో అక్కగా చాలా ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశారు. లేడీ క్యారెక్టర్ ఆర్టిస్టులకు మంచి డిమాండ్ ఉన్న టైంలో ఈవిడకు బ్రేక్ దొరికితే హైదరాబాద్ లోనే సెటిల్ కావచ్చు. టాలెంట్ ఉన్నా పెద్ద ఛాన్సులు దూరంగా ఉన్న వర్ష బొల్లమకు సైతం తమ్ముడు విజయం కీలకం. విరూపాక్ష తర్వాత మళ్ళీ ఆ స్థాయి మేజిక్ చూపించలేకపోయిన సంగీత దర్శకుడు అజనీష్ లోకనాథ్ తమ్ముడుతో హిట్టు కొడితే స్టార్ హీరోల పిలుపులు అందుకోవచ్చు. పవన్ కళ్యాణ్ లాంటి పెద్ద స్టార్ తో వకీల్ సాబ్ చేశాక వేణు శ్రీరామ్ కు టయర్ 1 హీరోల నుంచి పిలుపు రాలేదు. అందుకే తమ్ముడు మీద కసితో పని చేశారు. సెంటిమెంట్, ఎమోషన్ కి యాక్షన్ జోడించి పెద్ద ప్రయోగమే చేశారు. సంక్రాంతికి వస్తున్నాం సక్సెస్ స్ట్రీక్ ని తమ్ముడు కొనసాగిస్తుందని దిల్ రాజు భరోసాగా చెబుతున్నారు. మరి ఇందరి ఆశలు మోస్తున్న తమ్ముడుకి శకునాలు బాగున్నాయి. కుబేర ఫైనల్ రన్ వైపు వెళ్తోంది.

కన్నప్ప వండర్స్ చేయడం కష్టమే. సో ఈ గ్యాప్ ని వాడుకోవడానికి నితిన్ కిదే గోల్డెన్ ఛాన్స్. పాజిటివ్ టాక్ రావడం ఆలస్యం కనీసం రెండు వారాల పాటు సాలిడ్ కలెక్షన్ల రాబట్టొచ్చు.



# గేమ్ చేంజర్ డ్యామేజ్

## ముందే తెలిసిపోయింది

ఆర్ఆర్ఆర్ తర్వాత రామ్ చరణ్ హీరోగా నటించే సినిమా.. పైగా తమిళ లెజెండరీ డైరెక్టర్ శంకర్, టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన దిల్ రాజుతో కాంబినేషన్.. ఇలా గేమ్ చేంజర్ సినిమా అనౌన్స్ అయినపుడు మెగా అభిమానుల ఉత్సాహం అంతా ఇంతా కాదు. కానీ ఈ సినిమా రిలీజయ్యే సమయానికి ఆ ఉత్సాహం అంతా నీరుగారిపోయింది. సినిమా విపరీతంగా ఆలస్యం అయింది. పైగా టీజర్, ట్రైలర్ ఎగ్జైటింగ్‌గా అనిపించలేదు. దీనికి తోడు తొలి రోజు బ్యాడ్ టాక్ రావడంతో సినిమా దారుణమైన ఫలితాన్ని అందుకుంది. దిల్ రాజును ఈ సినిమా కొట్టిన దెబ్బ అలాంటిలాంటిది కాదు. ఆయన కెరీర్లోనే అత్యధిక నష్టాలు తెచ్చిపెట్టిన సినిమా ఇది. ఆ నష్టం రూ.100 కోట్ల పైమాటే అన్నది అంచనా. ఐతే ఈ సినిమా తనను ఆర్థికంగా పెద్ద దెబ్బ కొట్టబోతున్న విషయం రిలీజ్‌కు ముందే తనకు అర్థం అయిపోయిందని రాజు చెప్పాడు. కానీ సంక్రాంతికి వస్తున్నాం సినిమా మీద చాలా నమ్మకం ఉండడంతో తాను రికవర్ అవుతాననే ధీమా కూడా అదే స్థాయిలో వచ్చిందని రాజు చెప్పాడు. గేమ్ చేంజర్ తొలి రోజు పరిస్థితి చూడగానే అదెంత డ్యామేజ్ చేస్తుందన్న దానిపై తనకు అంచనా వచ్చిందని రాజు తెలిపాడు. ఇంకో మూడు రోజుల్లో సంక్రాంతికి వస్తున్నాం మ్యాజిక్ చేస్తుందనే నమ్మకంతో ఉన్నానని.. అనుకున్నట్లే ఆ సినిమా తనతో పాటు డిస్ట్రిబ్యూటర్లను, మొత్తంగా ఇండస్ట్రీని సేవ్ చేసిందని రాజు చెప్పాడు. గేమ్ చేంజర్‌తో పాటు తన సంస్థ సినిమానే అయిన సంక్రాంతికి వస్తున్నాంను ఈ సంక్రాంతికి రిలీజ్ చేయడానికి చిరంజీవి, రామ్ చరణ్ పెద్ద మనసుతో ఒప్పుకున్నారని రాజు వ్యాఖ్యానించాడు. గేమ్ చేంజర్ నష్టం వంద కోట్లు ఉండొచ్చా అంటే దాదాపు ఔనన్నట్లే మాట్లాడారు రాజు. సంక్రాంతికి వస్తున్నాం నుంచి వచ్చిన లాభాలను తానేమీ తీసుకోలేదని.. గేమ్ చేంజర్ వల్ల నష్టపోయిన తన డిస్ట్రిబ్యూటర్లకే పంచానని.. మొత్తం ఓవర్ ఫ్లోస్ అన్నీ వాళ్లకే వెళ్లాయని.. అందువల్ల వాళ్లు, ఇండస్ట్రీ సేవ్ అయిందని రాజు పేర్కొన్నాడు.

# డ్యామేజ్ పెంచుతున్న

# మెగా మౌనం



ప్రకటించిన టైంలో కేవలం ప్రీ లుక్ పోస్టర్ తోనే విపరీతమైన అంచనాలు రేపిన విశ్వంభర ప్రస్తుతం ఎప్పుడు విడుదలవుతుందో అర్థం కానీ డోలాయమానంలో ఫ్యాన్స్ సహనాన్ని పరీక్షిస్తోంది. మెగా కాంపౌండ్ టాక్ వింటుంటే అసలు 2025లో రిలీజ్ ఉండకపోవచ్చట. వచ్చే సంవత్సరం వేసవికి విడుదల చేయాలని ప్రాథమికంగా అనుకున్నట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం విశ్వంభర విఎఫ్ఎక్స్ పనులు ఒక కొలిక్కి వచ్చాయి. చిరంజీవి ఆ కాపీని చూడాలి. కానీ ఖాళీ లేదు. ఆయనేమో అనిల్ రావిపూడి మెగా 157 షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఎక్కువ గ్యాప్ దొరకడం లేదు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. చూస్తుంటే సంక్రాంతికి మెగా 157 ముందు రిలీజై ఆ తర్వాత తాపీగా విశ్వంభర వస్తుందనే కామెంట్స్ ఊపందుకుంటున్నాయి. క్వాలిటీ విషయంలో రాజీ పడకూడదనే సంకల్పంతో దర్శకుడు వశిష్ఠ పగలు రాత్రి ఆ పనుల మీదే ఉంటున్నాడట. బింబిసార ఇచ్చిన ఇమేజ్ ని కాపాడుకోవడానికి విశ్వంభర ఒక పెద్ద అవకాశం. అందులోనూ కళ్యాణ్ రామ్ బింబిసార 2 తీద్దామని పిలిస్తే దాన్ని వదులుకుని మరీ మెగాస్టార్ కోసం ఇటొచ్చాడు. తీరా చూస్తే విజువల్ ఎఫెక్ట్స్ కంపెనీల వల్ల అసలుకే మోసం వచ్చింది. టీజర్ టైంలో వచ్చిన నెగటివిటీని తట్టుకోలేకే తను బయట కనిపించడం మానేశాడని సన్నిహితుల మాట. హరిహర వీరమల్లు లాగా లేట్ అయితే అయ్యింది కానీ ముందైతే స్పష్టమైన అప్డేట్స్ ఇవ్వడం ద్వారా అల్రెడీ పడిపోయిన బజ్ మెల్లగా అయినా లేపొచ్చు. ఇంకోపక్క చిరంజీవి బయట ఈవెంట్లకు వస్తున్నారు, సోషల్ మీడియాలో వివిధ రకాల విషయాలపై ట్వీట్లు పెడుతున్నారు కానీ ఎక్కడా మాట వరసకైనా విశ్వంభర ప్రస్తావన లేదు. ఇది డ్యామేజ్ ని మరింత పెంచుతోంది. మెగా ఫ్యాన్స్ ఇప్పటికే రావిపూడి సినిమా వైపు షిఫ్ట్ అయిపోయారు. దృశ్యంలో వెంకటేష్ స్టైల్ లో విశ్వంభర అంటే మాకు తెలియదు, చూడలేదు అనే తరహాలో సెల్ఫ్ ట్రోల్స్ చేస్తున్నారు. మరి దీనికి చెక్ పడేది ఎప్పుడో చూడాలి.

# నన్ను నమ్మండి.. 'కింగ్‌డమ్'తో ఫుల్ మీల్స్



అర్జున్ రెడ్డి, గీత గోవిందం లాంటి బ్లాక్ బస్టర్లతో ఒక దశలో విజయ్ దేవరకొండ ఊపు మామూలుగా లేదు. తాను పదేళ్లు కష్టపడితే వచ్చిన స్టార్‌డమ్‌ను విజయ్ కెరీర్ ఆరంభంలోనే సంపాదించేశాడంటూ మెగాస్టార్ చిరంజీవి సైతం కొనియాడడంటే అతను ఏ రేంజికి వెళ్లాడో అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ ఫాలోయింగ్, మార్కెట్‌ను అతను నిలబెట్టుకోలేకపోయాడు. సరైన సినిమాలు ఎంచుకోలేక చతికిలబడ్డాడు. లైగర్, ఫ్యామిలీ స్టార్ సినిమాలు విజయ్ కెరీర్‌కు మామూలు డ్యామేజీ కాదు. ఇంకో డిజాస్టర్ పడితే కెరీర్ ప్రశ్నార్థకమయ్యే స్థితిలో అతను 'కింగ్‌డమ్' సినిమాను మొదలుపెట్టాడు. 'జెర్సీ' దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తీస్తున్న సినిమా కావడంతో దీనిపై అభిమానుల్లో ఆశలు ఉన్నాయి. పైగా టాలీవుడ్లో మోస్ట్ సక్సెస్ ఫుల్ బేనర్లలో ఒకటైన సితార ఎంటర్టైన్మెంట్స్‌లో తెరకెక్కుతున్న సినిమా కావడం ఇంకా ప్లస్. కాకపోతే సినిమా రిలీజ్ బాగా ఆలస్యం అవుతుండడం.. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలూ ఎంతకీ ఒక కొలిక్కి రాకపోవడంతో విజయ్ అభిమానుల్లో అసహనం పెరిగిపోతోంది. సినిమాకు రీషూట్లు ఏమైనా జరుగుతున్నాయా అనే సందేహాలు కలుగుతున్నాయి. నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో ఏ పోస్ట్ పెట్టినా.. విజయ్ అభిమానులు తిట్టిపోస్తున్నారు. 'కింగ్‌డమ్'ను పక్కన పెట్టేసి వేరే సినిమాల గురించి మాట్లాడుతున్నాడంటూ కౌంటర్లు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నాగవంశీ.. 'కింగ్‌డమ్' గురించి లేటెస్ట్‌గా ఒక పోస్టు పెట్టాడు. "నన్ను నమ్మండి.. ఈ సినిమాతో మీకు ఫుల్ మీల్స్" అంటూ విజయ్ అభిమానులను అతను ఊరించాడు. "ఏం పోస్ట్ చేసినా 'కింగ్‌డమ్' మీద తీయటి శాపనార్థాలు మాత్రం వస్తూనే ఉంటాయి అని తెలుసు. కానీ నన్ను నమ్మండి. ఒక భారీ బిగ్ స్క్రీన్ అనుభవాన్ని ఇవ్వడానికి మా టీం రేయింబవళ్లు కష్టపడుతోంది.

## 'కొత్తపల్లిలో ఒకప్పుడు'

# ఏం జరిగింది?





వైవిధ్యమైన సినిమాలను నిర్మించడంలో హీరో రానాకు ఎప్పుడూ ముందుంటారు. ఈ క్రమంలోనే ఆయన మరో సరికొత్త కాన్సెప్ట్ ఉన్న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. తన స్పిరిట్ మీడియా బ్యానర్‌పై 'కొత్తపల్లిలో ఒకప్పుడు' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ప్రవీణ పరుచూరిని దర్శకురాలిగా పరిచ యం చేస్తున్నారు. సున్నితమైన హాస్యంతో ఉండే లైట్ హార్టెడ్ ఎంటర్‌టైనర్ ఇది. 'కేరాఫ్ కంచరపాలెం, ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' వంటి కల్ట్ చిత్రాలను నిర్మించిన నిర్మాత ప్రవీణ ఈ సినిమాతో డైరెక్షన్‌లోకి అడుగు పెడుతున్నారు. ఒక సంఘటన తర్వాత ఊహించని మలుపు తిరిగిన ఒక గ్రామ యువకుడి జీవితం నేపథ్యంలో సాగుతుంది. లాస్ ఏంజిల్స్‌కు చెందిన అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ ఈ సినిమాకు న్యూ విజువల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తున్నారు. అద్భుతమైన పాటలు, డ్యాన్స్ సీక్వెన్సులు, హాస్యంతో కూడిన ఉపకథల ద్వారా ఈ చిత్రం సరికొత్త అనుభూతిని పంచబోతోంది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది అని చిత్ర బృందం తెలిపింది. 'నేను నటించే సినిమాలే కాదు.. నిర్మించే సినిమాలు సైతం సరికొత్తగా ఉండాలని కోరుకుంటాను. ఆ ప్రయత్నంలో భాగంగా ఇప్పుడు 'కొత్తపల్లిలో ఒకప్పుడు' వంటి మరో వైవిధ్యమైన చిత్రంతో రాబోతున్నాను. ఓ సంఘటన ద్వారా ఓ యువకుడి జీవితంలో ఏం జరిగింది అనే పాయింట్‌తో ఈ సినిమాని ప్రవీణ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు' అని రానా చెప్పారు.

# మంచు విష్ణు తర్వాతి

## చిత్రం దర్శకుడు ఇతనేనా?

ఈ శుక్రవారం తన కలల ప్రాజెక్టు భక్త కన్నప్పతో ప్రేక్షకులను పలకరించాడు మంచు విష్ణు. రూ.200 కోట్లకు పైగా బడ్జెట్ పెట్టి తీసిన ఈ సినిమాకు ఆశించిన స్థాయిలో బిజినెస్ ఆఫర్లు రాకపోతే సొంతంగా రిలీజ్ చేసుకున్నాడు విష్ణు. అంతే కాక ఓటీటీ, ఇతర హక్కులను సైతం అమ్మలేదు. ఐతే సినిమా మంచి ఫలితాన్నందుకుని తన పెట్టుబడినంతా వెనక్కి తీసుకు వస్తుందని అతను బలంగా నమ్మాడు. వీకెండ్లో సినిమాకు వస్తున్న స్పందన చూస్తే విష్ణు నమ్మకం నిలిచేలాగే కనిపిస్తోంది. తొలి రెండు రోజుల్లో ఈ సినిమా రూ.40 కోట్ల మేర వసూళ్లు రాబట్టింది. ఆదివారం కూడా స్ట్రాంగ్‌గానే నిలబడింది. మరి వీకెండ్ తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. మొత్తానికి కన్నప్పకు వస్తున్న స్పందనతో ఖుషీగా ఉన్న విష్ణు.. దీని తర్వాత ఏ సినిమా చేస్తాడన్నది ఆసక్తికరం. కన్నప్ప సక్సెస్ మీట్లో కొత్త సినిమా గురించి కబురేమీ చెప్పలేదు కానీ.. తాను నమ్మిన ప్రతి కథనూ చేయడానికి ఈ చిత్ర విజయం ఉత్సాహాన్నిచ్చిందని చెప్పాడు. తర్వాత పక్కా కమర్షియల్ సినిమా చేసే అవకాశాలున్నట్లు సంకేతాలు ఇచ్చాడు. ఆ సినిమాను ప్రభుదేవా డైరెక్ట్ చేయబోతున్నాడన్నది మంచు కాంపౌండ్ నుంచి వినిపిస్తున్న కబురు. విష్ణుతో ప్రభుదేవాకు మంచి అనుబంధమే ఉంది. తన చివరి చిత్రం జిన్నాతో పాటు కన్నప్ప సినిమాకూ కొరియోగ్రఫీ చేశాడు ప్రభుదేవా. న్యూజిలాండ్‌లో 'కన్నప్ప' టీంతో పాటు చాలా రోజులు ఉన్న ప్రభుదేవా.. కొరియోగ్రఫీలో మాత్రమే కాక మేకింగ్ పరంగానూ సాయం చేసినట్లు సమాచారం. తెలుగులో నువ్వొస్తానంటే నేనొద్దంటానా సినిమాతో దర్శకుడిగా ప్రయాణం మొదలుపెట్టిన ప్రభుదేవా.. తర్వాత బాలీవుడ్‌కు వెళ్లి కొన్ని చిత్రాలు డైరెక్ట్ చేశాడు. ఐతే ఒక దశ తర్వాత దర్శకుడిగా వరుసగా ఫెయిల్యూర్లు రావడంతో బ్రేక్ తీసుకున్నాడు. నటుడిగానే సినిమాలు చేస్తూ వచ్చాడు.

# దీపావళి కానుకగా..



హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కె- ర్యాంప్'. ఇది ఆయన హీరోగా నటిస్తున్న 11వ చిత్రం. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ల మీద రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలిసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ఈ సినిమా కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో ఫ్రెష్ అటెంప్ట్ అవుతుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ ఏడాది దీపావళి పండగ నేపథ్యంలో ఈ మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది అని చిత్ర యూనిట్ తెలిపింది. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ - బ్రహ్మ కడలి, యాక్షన్ - పృథ్వీ, ఎడిటర్ - ఛోటా కె ప్రసాద్, డీవోపీ - సతీష్ రెడ్డి మాసం, మ్యూజిక్ - చేతన్ భరద్వాజ్, కో-ప్రొడ్యూసర్-బాలాజీ గుట్ట, ప్రొడ్యూసర్ - రాజేష్ దండా-శివ బొమ్మకు, రచన, దర్శకత్వం - జైన్స్ నాని.

## తెలంగాణ ముఖ్యమంత్రి ని కలిసిన
# ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని హైదరాబాదులోని తెలంగాణ భవన్ నందు కలిశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హైదరాబాద్ లోని తన నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కలంకారి శాలువా తో సత్కారం చేసి, ప్రసిద్ధ శ్రీకాళహస్తి ప్రసాదం ను అందజేశారు. ఈ భేటీలో సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ప్రాధాన్యం గురించి వివరించారు. ఈ ఉత్సవానికి దేశం నలుమూలల నుండి లక్షలాది భక్తులు చేరుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివంగత నేత బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని, పార్టీ కోసం ఆయన చేసిన కృషి, నిబద్ధతను స్మరించుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మంత్రి హోదాలో హైదరాబాద్ అభివృద్ధిలో ఆయన పోషించిన ముఖ్యపాత్రను గుర్తుచేసుకున్నారు. అలాగే శ్రీకాళహస్తి దేవస్థానంలో తెలంగాణ భవన్ నిర్మాణం కోసం ప్రతిపాదనను సుధీర్ రెడ్డి తో చర్చించారు. శ్రీ కాళహస్తి ప్రాంతంలోని వాసులు తయారు చేసే ప్రఖ్యాత కలంకారి హస్తకళల విశిష్టతను, వాటి అంతర్జాతీయ ఖ్యాతిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కళాకారులను మరింత ప్రోత్సహించడం, కలంకారికి అవసరమైన మద్దతు అందించడం అవసరమని సూచించారు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కలంకారి శాలువాను చూసి చాలా ఆనంద వ్యక్తం చేశారు శ్రీకాళహస్తిలో తయారయ్యే కలంకారీ కు సంబంధించి తెలంగాణ రాష్ట్రం సంబంధించిన ఎటువంటి సహాయం కావాలన్నా ముందుంటానని హామీ ఇచ్చారు.

## మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు పుట్టినరోజు వేడుకలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) రంగినేని చెంచయ్య నాయుడుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తేలియజేసిన ఎస్టీ సెల్ సుబ్బయ్య. శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్. పిలిస్తే పలికే నాయకుడు స్నేహబంధు ప్రతి ఒక్కరికి తన వంతు కృషి చేసే నాయకుడు రంగినేని చెంచయ్యనాయుడు ని దుశ్యాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య.

## వాజేడు మండల కేంద్రం లో
# ఎమ్మార్పీఎస్ సమావేశం

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెన్నం స్వామి మాదిగ**



వాజేడు (ప్రశ్న న్యూస్) ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి వాజేడు మండల ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు ఇంచార్జ్ పుల్లూరి కరుణాకర్ మాదిగ ఎమ్మెస్ పి మండల అధ్యక్షులు పేట సమ్మలు మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా ఇన్చార్జిలు చాతాళ్ళ రమేష్ మాదిగ తడుగుల విజయ్ మాదిగ మాట్లాడుతూ సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతల లేని నూతన సమాజ నిర్మాణం కాంక్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందని అన్నారు మాదిగ సమాజానికి దక్కవలిసిన రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతూనే మరోవైపు నిరాదరణకు గురైన వర్గాలైన వికలాంగుల వృద్ధులు వితంతువుల కోసం పోరాడి వారికి పెన్షన్లు సాధించడం జరిగింది. గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ పథకం, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, మహిళ భద్రత కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, తెల్ల రేషన్ కార్డు ప్రజలకు 6 కిలోల బియ్యం పెంపు మొదలగు ఫలితాలను ఎమ్మార్పీఎస్ సాధించిందని అన్నారు. ఈ ఫలాలు కేవలం మాదిగల కోసం చేసినవి కావని , అన్ని వర్గాల సంక్షేమం సామాజిక బాధ్యతతో చేసిన ఉద్యమలని అని అన్నారు. కాబట్టి సమాజ హితమే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని అన్ని వర్గాల ప్రజలు గుర్తించాలని అన్నారు. మాదిగల కోసం ముప్పై ఏళ్లుగా జరిగిన రాజీలేని పోరాటం విజయవంతమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతుందని అన్నారు. ఈ విజయానికి కారణం ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు అందించిన సహకారమే అని అన్నారు .దేశంలో ఎన్నో కుల ఉద్యమాలు పుట్టినప్పటికీ లక్ష్యం సాధించే వరకు ఏ ఉద్యమం నిలబడలేకపోయాయి కాని ఎమ్మార్పీఎస్ మాత్రమే సజీవంగా నిలబడి లక్ష్యం చేరిందని దానికి సమాజం ఇచ్చిన సహకారమే ప్రధాన కారణమని అన్నారు. కనుక సమాజానికి కృతజ్ఞతగా భవిష్యత్ ఉద్యమ కార్యాచణతో ముందుకు సాగుతామని అన్నారు . ఈ నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు నూగురు వెంకటపురం మండల ఇంచార్జ్ వావిలాల స్వామి మాదిగ ఉపాధ్యక్షులు లేగల రవి మాదిగ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాజేష్ మాదిగ కార్యదర్శి జ్యోతి మాదిగ సహాయ కార్యదర్శి రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీకి చల్మెడ పరామర్శ



వేములవాడ, (ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గంలోని భీమారం మండల మాజీ ఎంపిటిసి అజిత్ రావుకు ఇటీవల ప్రమాదం జరిగి కాలు విరుగగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మంగళవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఫార్మా కంపెనీ లో బాయిలర్ పేల్లుడు వ్యక్తికి తీవ్రగాయాలు

**స్థానిక ఆస్పత్రికి తరలింపు**

**గోప్యంగా ఉంచుతున్న కంపెనీ యజమాని**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా పెను విషాదం మిగిలించిన పాషామైలారంలో ఫార్మా కంపెనీ లో కెమికల్ పేలిన ఘటన తరహాలోనే మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కంపెనీ లో పేలుడు సంభవించింది .స్థానికుల వివరాల ప్రకారం మేడ్చల్ పారిశ్రామిక వాడలో ఆల్కలాయిడ్ కంపెనీ లో బాయిలర్ పేలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. షాపూర్ కు చెందిన గన్నారం శ్రీనివాస్ రెడ్డి గత 12 సంవత్సరాలు గా కంపెనీ లో పని చేస్తునాడు .మంగళవారం ఉదయం కంపెనీ లో ఉన్న బాయిలర్ ఒకసారిగా పేలడంతోకుప్పకూలిపోయాడు .దీంతో కంపెనీ లోని తోటి కార్మికులు శ్రీనివాస్ రెడ్డి ను స్థానికంగా ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. శ్రీనివాస్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయాని కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచుతున్న తెలుస్తుంది.

**పెద్ద శబ్దంతో పేలుడు..**

ఉదయం 10 సమయంలో బైలర్ పేలడంతో పెద్ద శబ్దం వచ్చిందని తోటి కార్మికులు తెలిపారు., కంపెనీ పైరేకులు, ఫైనల్ బోర్డు ఎగిరి పడ్డాయి. ఆ సమయంలో బాయిలర్ వద్ద డ్యూటీ చేస్తున్న గన్నవరం శ్రీనివాస్ రెడ్డి రెండు కాళ్లు ఫ్యాక్చర్ అయ్యాయని, తలకు చేతులకు కార్యాలయాయని వారు తెలిపారు.

**ఈ కంపెనీకి ఫైర్ సేఫ్టీ లేదు..**

ఆల్కలాయిడ్ కంపెనీ కి ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. కార్మికులకు ఎలాంటి హెల్త్ కార్డులు ఇవ్వలేదని,



బైలర్ పేలిన ఘటనలో గాయపడ్డ కార్మికుడు శ్రీనివాస్ రెడ్డికి వైద్య ఖర్చులను కంపెనే భరించాలని తోటి కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

# 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంత చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు అశోక్, చంద్రశేఖర్లు కోరారు. సిఐటియు మేడ్చల్ మండల కమిటీ ఆధ్వర్యంలో 9న జరిగే పోస్టర్ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలంటూ పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అశోక్ చెంద్రశేఖర్ లు మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నదని ఆరోపించారు. కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలలో సాధించుకొన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కొడ్లను ముందుకు తెచ్చిందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా గత ఐదేళ్ళుగా కార్మికవర్గం చేస్తున్న ఆందోళనా, పోరాటాలతో లేబర్ కొడ్లు అమలు 5 సంవత్సరాలు ఆలస్యమైనా, ఇప్పుడు వాటిని అమలు చేసి కార్మిక హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. 2025–26 బడ్జెట్లో తమ కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసిందని, సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందని సామాన్యులపై భారాలు మోపి, కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ప్రకటించింది అని అన్నారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకపోగా, ఈ సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చే ఆర్థిక విధానాలను విచక్షణారహితంగా అమలు చేస్తున్నది. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకొనేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు 2025 జులై 09న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయి అని అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మికవర్గం జులై 09న జరిగే సమ్మెకు సమాయత్తం కావాలని, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులందరూ ఈ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు ఎం పి నరేష్, దేవేందర్, సుధాకర్, బాణ్య, లక్ష్మణ్, పరశురామ్, నర్సింహా, కృష్ణ, వెంకటేష్, నర్సింగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు వైద్య సేవలందిస్తున్న
# ఒకే ఫ్యామిలీకి చెందిన 18 మంది వైద్యులు

**-జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా అభినందనలు తెలియచేసిన ప్రజలు, పలువురు నాయకులు,వైద్యులు**



జగిత్యాల(ప్రశ్న న్యూస్) భారత ప్రభుత్వం 1991 లో జూలై 1 ను జాతీయ వైద్యుల దినోత్సవంగా ప్రకటించింది. ప్రజల జీవితాలకు, సమాజానికి వైద్య నిపుణులు చేసే అమూల్యమైన కృషిని గౌరవించడానికి, గుర్తించడానికి భారతదేశం ప్రతి సంవత్సరం జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించడానికి వైద్యులు వారి అవిశ్రాంత కృషి, కరుణ,నిబద్ధతకు కృతజ్ఞతలు తెలియజేయడానికి ఇది ఒక అవకాశాన్ని అందిస్తుంది. జగిత్యాల జిల్లాలో ఒకే ఫ్యామిలీకి చెందిన 18 మంది వైద్యులు వివిధ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా ప్రజలు, పలువురు నాయకులు,వైద్యులు వారికి అభినందనలు తెలియచేసారు.

## నియోజకవర్గ సన్నాహా
# సమావేశం ఏర్పాట్లపై సమీక్ష



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు యాదగిరిగుట్ట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్ గౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో మీడియాకు ఆయన వివరాలు వెల్లడించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన వ్యూహాలపై సమావేశంలో వారు పలు సూచనలు చేయనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఆలేరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పీఏసీఎస్ చైర్మన్లు, పాల సంఘం చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీలు, రైతు విభాగం కన్వీనర్లు, పార్టీ వివిధ విభాగాల నాయకులు, విద్యార్థి, యువజన, సోషల్ మీడియా నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**గిరిప్రదక్షిణలో పాల్గొననున్న మాజీ మంత్రి హరీశ్‌రావు..**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక గిరి ప్రదక్షిణలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొననున్నట్లు గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. తెల్లవారుజామున 6.30 గంటలకు స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద స్వామివారి కొండ చుట్టూ పాదయాత్రగా ప్రదక్షిణ చేయనున్నారని, అనంతరం స్వామివారి గర్భాలయంలో నిర్వహించే అష్టోత్తర శతఘటాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, యువజన విభాగం నియోకవర్గ కన్వీనర్ గడ్డమీది రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య, గుండ్లపల్లి వెంకటేశ్ గౌడ్, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మాజీ సర్పంచ్ కసావు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చెట్టును డీ కొట్టి భయబ్రాంతులకు
# గురి చేసిన వ్యక్తి పై కేసు నమోదు



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన వాగుమడి వెంకట లక్ష్మీ తన ఇంట్లో పిల్లలతో నిద్రిస్తున్న సమయంలో వరంగల్ కు చెందిన సుకోగా పెట్టం వెంకటేష్ అనే వ్యక్తి బోలోరే వాహనంతో ఇంటి ముందు ఉన్న చెట్టును డీ కొట్టి తమను తీవ్ర భయాందోళనకు గురి చేశాడని వెంకటలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ ఐ కె.రాహుల్ రెడ్డి తెలిపారు. తన ఇంట్లో పిల్లలతో కలిసి నిద్రిస్తుండగా బొలెరో వాహనాన్ని అతి వేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి తమ ఇంటి ముందున్న చెట్టును డీ కొట్టి తమను బయ బ్రాంతులకు గురి చేశాడని వెంకటలక్ష్మీ చేసిన ఫిర్యాదు మేరకు సుకోగా పెట్టం వెంకటేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ రాహుల్ రెడ్డి తెలిపారు.

## భాజపా మండల ప్రధాన కార్యదర్శిగా దాసరి గణేష్

**ఘనంగా సన్మానించిన ముదిరాజులు**



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) మండల భాజపా ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి గణేష్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు గొల్లపల్లి ముదిరాజు కుల సంఘం సభ్యులు కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ ముదిరాజు నుండి దాసరి గణేష్ ఎంపిక కావడం గర్వంగా ఉందని సంఘ సభ్యులు తెలిపారు. అన్ని రంగాలలో ముందంజలో ఉంటూ సామాన్య ప్రజానీకానికి చేయూతన అందించాలని, సమస్యలకు ముందుండి కొట్లాడి న్యాయం చేకూర్చాలని ముదిరాజుల హక్కుల సాధన కోసమే కాకుండా సబ్బండ వర్గాల సమన్యాయం కోసం పాటుపడాలని భవిష్యత్ తరాలకు దిక్సూచిలా మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపెల్లి ముదిరాజ్ సంఘం నాయకులు, కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారుల ఫోటోలు

# ట్యాంక్‌బండ్‌పై ప్రదర్శించాలి

### అక్రమ నిర్మాణాలపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

- అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు
- ట్యాంక్ బండ్‌పై ఫోటోల ప్రదర్శన చేయాలని ఆదేశం
- కమిషనర్ నిర్లక్ష్యంతోనే పెరిగిపోతున్న అవినీతి అధికారులు
- అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు శూన్యం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు తీసుకుంటున్న చర్యల పట్ల తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఓ పిటిషన్ విచారణ సందర్భంగా అధికారుల నిర్లక్ష్యంపై మండిపడింది. అటువంటి అధికారుల ఫోటోలు ట్యాంక్‌బండ్‌పై ప్రదర్శించాలని కీలక వ్యాఖ్యలు చేసింది. రాజేంద్రనగర్‌లోని తమ ప్రైవేటు భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని నగరానికి చెందిన సయ్యద్ రహీమున్నీసా సహా మరో ఏడుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది.విచారణలో భాగంగా పిటిషన్ వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ విజయసాయి రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోటం ఏందని అధికారులను ప్రశ్నించారు. అటువంటి అధికారుల ఫోటోలను ప్రజలందరూ చూసే విధంగా ట్యాంక్ బండ్‌పై ప్రదర్శించాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని స్టాండింగ్ కౌన్సిల్ పేర్కొంది. జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం టాస్క్ ఫోర్స్ అధికారులకు ఉత్తర్వులు పంపించామని అంటున్నారు. టాస్క్ ఫోర్స్ అధికారులేమో పోలీసుల నుండి భద్రత లేదని, తమకు సహకారం అందడం లేదని చెబుతున్నారు. ఇది శాంతిభద్రతల సమస్య అని పోలీసులు చెబుతున్నారు. ఇలా అందరూ చేతులు దులుపుకుంటే ఎలా.? అంటూ హైకోర్టు ధర్మాసనం అధికారుల



తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం, బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టేయడం పట్ల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వచ్చే వాయిదాలోగా పిటిషనర్ ఇచ్చిన వినతి పత్రంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ ఘటన అక్రమ నిర్మాణాల నియంత్రణలో ప్రభుత్వ యంత్రాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను, అధికారుల నిర్లక్ష్యాన్ని మరోసారి స్పష్టం చేసింది. హైకోర్టు వ్యాఖ్యలు అక్రమ నిర్మాణాల విషయంలో అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

**జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతారాహిత్యం తోనే..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలలో టౌన్ ప్లానింగ్ విభాగం నందు సిసిపి, ఏసీపీలు, సెక్షన్ ఆఫీసర్లు, చైన్ మెన్లు భారీగా అవినీతికి పాల్పడడంతో పాట వారికి సహకరిస్తున్న డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఇలా అందరూ అధికారులు ఏకమై అక్రమ నిర్మాణాల వద్ద భారీగా దండుకొని ప్యాకేజీల రూపంలో తీసుకుంటున్న ఆరోపణలు ఉన్నాయి. ట్యాంక్ బండ్ పై మున్సిపల్ అధికారులు అవినీతి అధికారుల కోసం ఒక నోటీసు బోర్డును ఏర్పాటు చేయాలని దానిలో ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ఆ నోటీసు బోర్డులో అవినీతి అధికారుల ఫోటో లు సంబంధించిన సమాచారం పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది అధికారులు అవినీతికి పాల్పడితే ఫిర్యాదులు చేసిన జోనల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి కమిషనర్ చర్యలు తీసుకోకపోవడం వలన అవినీతి బాగా పెరిగిపోయిందని దీనికి పూర్తి బాధ్యత వహించాల్సింది ఉన్నత అధికారులే అని ప్రజలు పేర్కొంటున్నారు. ఇలా సామాన్య ప్రజలు ఇచ్చిన అనేక ఫిర్యాదులపై, అక్రమ నిర్మాణాలపై కోర్టులు స్పందిస్తే ఉన్నత అధికారులలో కొంచమైనా మార్పు వస్తుందని ఈ అక్రమ నిర్మాణాలకు పూర్తి బాధ్యత వహించాల్సింది జోనల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి కమిషనర్, సిసిపి అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అల్వానందమే.. ఎదురుదెబ్బ కాదు

### - ఎన్నికల తర్వాత తిరిగి అనుమతులు.?

**అమరావతి (ప్రశ్న న్యూస్)** బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. బనకచర్లకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. బనకచర్లకు పర్యావరణ అనుమతులు తిరస్కరించిన కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కార్ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తిప్పి పంపింది. అయితే ఇది తాత్కాలిక బ్రేకులా? లేక శాశ్వతంగా అనుమతులు ఇవ్వరా? అన్నది తేలాల్సి ఉంది. కానీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యానే బనకచర్లకు అనుమతులు ఇవ్వకోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. అందుకే ఏపీ ప్రభుత్వానికి చెందిన నేతలు మాత్రం ఇది తాత్కాలిక బ్రేకులేనని, ఖచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెబుతున్నారు.

**- గేమ్ ఛేంజర్ గా భావించి..**

బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిని గేమ్ ఛేంజర్ గా చంద్రబాబు అభివర్ణించారు. గోదావరిలో వృథాగా తరలిపోయే నీటిని పోలవరం ప్రాజెక్టు ద్వారా కాల్వల ద్వారా రాయలసీమతో పాటు కోస్తాంధ్రలోని అన్ని జిల్లాలకు మళ్లించాలన్నది చంద్రబాబు ఆలోచన. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు కోసం ఎనభైవేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశార. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ, టీడీపీ కలసి ఉండటంతో సులువుగా అనుమతులు సాధించవచ్చని భావించి ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు.

**- రాజకీయంగా అగ్గి రాజుకోవడంతో..**

అయితే బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణలో రాజకీయంగా అగ్గి రాజుకుంది. తమకు న్యాయంగా దక్కాల్సిన గోదావరి నీటిని అక్రమంగా ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుందని తెలంగాణలోని అన్ని పార్టీలు ఆందోళనకు దిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలసి వచ్చారు. మరొకవైపు



తెలంగాణ బీజేపీ నేతలు కూడా పార్టీ నాయకత్వంపై వత్తిడి తెచ్చారు. బనకచర్లకు అనుమతులు మంజూరు చేస్తే ఆ ప్రభావం తెలంగాణ రాజకీయాల్లో పడే అవకాశముందని పార్టీ పెద్దలకు నచ్చచెప్పడంలో సక్సెస్ అయ్యారు. అందుకే పర్యావరణ అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర, అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది.

**- అభ్యంతరాలు వ్యక్తం కావడంతో..**

తెలంగాణ నుంచి అనేక అభ్యంతరాలు ప్రాజెక్టుపై వ్యక్తమయ్యాయి. నీటి కేటాయింపులకు విరుద్ధమంటూ ఢిల్లీ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ గళమెత్తారు. వరద జలాలపై సమగ్ర అధ్యయనం చేయాలంటూ డిమాండ్ చేశారు. అందుకే ముందుగా అంతరాష్ట్ర అనుమతులు ప్రాజెక్టుకు పొందాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో నిధుల కేటాయింపు కూడా కష్టసాధ్యమవుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై పునరాలోచించే వీలుందని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతిస్తే తెలంగాణలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందని భావించి బ్రేకులు వేసిందన్నది వాస్తవం.

# భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ. 10,000 లంచం

### - ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన తహసీల్దార్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అవినీతిపై ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా రంగారెడ్డి జిల్లాలో ఒక తహసీల్దార్, అటెండర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. భూమి రిజిస్ట్రేషన్ కోసం రైతు నుంచి లంచం డిమాండ్ చేయడమే కాకుండా, ఆ మొత్తాన్ని స్వీకరిస్తుండగా వారిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలంలో ఒక రైతు తన కుటుంబ సభ్యుల పేరిట 22 గుంటల వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అయితే, ఈ పనిని పూర్తి చేయడానికి తలకొండపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న బి. నాగార్జున, అదే కార్యాలయంలోని అటెండర్ యాదగిరి కలిసి బాధితుడి నుంచి రూ.10,000 లంచం డిమాండ్ చేశారు. అధికారుల తీరుతో విసిగిపోయిన బాధితుడు, నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించి తన గోడు వెళ్లబోసుకున్నారు. అతని ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ముందుగా అనుకున్న ప్రకారం, మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు రూ.10,000 ఇస్తుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, తహసీల్దార్ నాగార్జున, అటెండర్ యాదగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**- లంచం అడిగితే ఫిర్యాదు చేయండి: ఏసీబీ**

ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం అడిగినా, వేధించినా భయపడకుండా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాధితులు తమ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా




కూడా తమను సంప్రదించవచ్చని అధికారులు వివరించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

# కాళేశ్వరం కాదు కూలేశ్వరం

### మంత్రి సీతక్క ఎద్దేవా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ సర్కారు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడేళ్లలోనే కూలేశ్వరంగా మారిందని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. బీఆర్ఎస్ పై విమర్శలు సంధించారు. ఆ పార్టీ హాయంలో తెలంగాణ నాశనం అయిందని సీతక్క అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో రాష్ట్రం సాధించుకున్నామని గుర్తు చేశారు. కానీ 2014 తర్వాత నిధులు, నియామకాలన్నీ కేసీఆర్ కుటుంబ సభ్యులకు.. నీళ్లన్నీ ఫాం హౌస్ కు తరలిపోయాయని విమర్శించారు. నాడు వరి వేస్తే రైతులకు ఉరి పడ్డట్టేనని అన్నారని.. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పండించిన రైతులకు రూ. 500 బోనస్ ఇస్తోందని చెప్పారు.దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో పేద ప్రజలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని... 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ ఇస్తున్నామని సీతక్క తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో కేవలం 60 వేల ఇళ్లు మాత్రమే పేదలకు మంజూరయ్యాయని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సీతక్క సూచించారు.

# మీ ప్రతాపం.. పేదల మీదేనా..?

### హైడ్రా విషయంలో రేవంత్ పై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పేదల గుడిసెలపై మాత్రమే.. హైడ్రా బుల్డోజర్లు దూసుకెళ్తున్నాయని.. కాంగ్రెస్ నేతలు, బడా బాబుల ఆక్రమణలపై మాత్రం హైడ్రా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైరయ్యారు. కాంగ్రెస్ నేతల ఇళ్ళు, బడాబాబుల ఇళ్ళు చెరువుల ఒడ్డున బఫర్ జోన్లో %ఖీూ% పరిధిలో ఉంటే హైడ్రాకు కనబడటం లేదా అని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణలో




రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా ద్వారా చెరువుల బఫర్ జోన్‌లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామంటూ.. కేవలం నిరుపేదల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటూ హైకోర్టు స్టే ఆర్డర్లను ఉల్లంఘిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కొడంగల్లో రెడ్డికుంటలో, ఆయన సోదరుడు తిరుపతి రెడ్డి దుర్గం చెరువు %ఖీూ%లో, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హిమాయత్ సాగర్‌లో, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి చెరువు నడుమ గెస్ట్ హౌస్, కేవీపీ వంటి పెద్దలు బఫర్ జోన్‌లో గెస్ట్ హౌస్‌లు, పెద్ద బిల్డర్లు మూసీ నదిలో అపార్ట్‌మెంట్లు నిర్మించుకుంటే హైడ్రాకు గాని, ముఖ్యమంత్రి కంటికి ఇవి కనబడకపోవడం శోచనీయం అన్నారు. కాని నిరుపేదలు, దిగువ మధ్య తరగతి ప్రజలు తమ ఇళ్లు కూల్చొద్దని, హైకోర్టు స్టే ఆర్డర్ ఉందని నిరుపేదలు నెత్తి నోరు మొత్తుకున్నా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన : పొంగులేటి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హమైన అన్నింటినీ సానుకూలంగా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ జరపాలని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలన్నింటినీ ఒకే డాక్యుమెంట్ గా భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించవలసి వచ్చిందో అనే వివరాలను లిఖిత పూర్వ కంగా దరఖాస్తుదారులకు అందించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించామని ఇందులో 8,27,230 దరఖాస్తులు వచ్చాయని ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తులను డేటా ఫార్మేట్ లో భూభారతి పోర్టల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. మిగిలినవాటిని కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో గౌరవ సీఎం నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ చట్టం ద్వారా దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఏప్రిల్ 17వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు దశల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందన్నారు. సర్వే నెంబర్లలో లోపాలు పిపిబి, ఆర్వోఆర్, నాలా, ఆర్ .ఎస్ .ఆర్ సవరణ, అప్పీల్స్, కోర్టుకేసులు, పోడుభూములు తదితర 30 రకాల భూ సమస్యలపై 8.27 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ఈ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే ధరణి పోర్టల్ మూలంగా తెలంగాణ ప్రజానీకం ముఖ్యంగా రైతాంగం ఎదుర్కొన్న సమస్యలు కళ్లకు కట్టినట్లు కనబడుతున్నాయన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన స్వార్థ పూరితమైన ఆర్వోఆర్ చట్టం 2020 వల్ల ఇబ్బందులు పడిన తెలంగాణ ప్రజానీకానికి భూభారతి చట్టం ద్వారా విముక్తి కల్పిస్తామని ప్రకటించారు. కింది నుంచి పై స్థాయి వరకు మొత్తం రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక ఎజెండాగా తీసుకొని సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588